# సిలికానాంధ్ర

తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తి

# సుజనరంజని



శ్రీ వికారినామ ఉగాదిఉత్సవ ప్రత్యేక సంచిక.

సిలికానాంధ్ర

# సుజనరంజని

అంతర్జాతీయ సాహితీ పొదరిల్లు

## శ్రీ వికారి నామ ఉగాది ఉత్సవ ప్రత్యేక సంచిక

**సంపాదక వర్గం**

తాటిపాముల మృత్యుంజయుడు

రాపోలు సీతారామరాజు

పుల్లెల శ్యామసుందర్

కాశీవఝుల శారద

**ముఖచిత్రం**

శ్రీ కూచి

# ఈ ప్రత్యేక సంచికలో...

- పద్య కవిత్వం
- వచన కవితలు
- కార్టూన్లు
- కథలు
- వ్యాసాలు

# ఏటిమొగ ఊసులు

- అవధాని **డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**

శ్రీవ్రాసినట్లుగ, పుడమి
చేవ్రాలుగ ఏటిమొగను చివురులు పూవుల్
మైత్రేలు మావిపిందెల
తోవ్రేగగుచున్ 'వికారి' తోతెంచె బళీ।

రవిపుత్రుండు యమాగ్రజుండు శనియే రాజైన ఏడాదిలో
ఎవి ఎట్లుండునో కష్ట సౌఖ్యములు తామే చెప్పు పంచాగముల్
కవితామూర్తులు క్రకింత దర్శులగుటన్ కావింత్రు సమ్మేళన
స్తవముల్ సప్తగిరీశ। శ్రోతవగుచున్ సమ్మానముల్ సల్పుమా।

పంచభూతాల పక్షాన స్వాగతమ్ము
సర్వజీవుల పక్షాన స్వాగతమ్ము
క్రొత్త యేడాదివై వచ్చి కూరుచున్న
శ్రీవికారి। మ్రొక్కెద మంచి చేయుమయ్య।

దేవభాష 'వికారమే' తెలుగు మార్పు
మార్పులొప్ప 'వికారి' నామంబు వచ్చె
భయవదేటికి? నీ పేరు బాగు బాగు
మంచి మార్పులు తెమ్ము సేమమ్ము నిమ్ము

రాలిన పండుటాకులవి రమ్యముగా చివురాకులైన
లీలయెధైర్యమిచ్చు నవలీలగ జీవితమెల్ల సాగిపో
జాలిన తత్త్వబోధ మధురశైశిర బంధముగా 'వికారి'వై
నేలకు వచ్చినట్టి నవనేతవు మమ్ముల తీర్చి దిద్దుమా।

వేకువల నిద్ర మేల్కొల్పు కాకికూత
ఆమనిని బుద్ధి మేల్కొల్పు నల పికమ్ము
రెండు గూర్చును బ్రతుకుల నిండుదనము
కోకిలా। స్వాగతము నందుకొనుము। రమ్ము।

కోకిలయ్యకన్న కోడెక్కువయ్యెను
కత్తి కట్టి దూకె కదనమునకు
గుబురులోన దాగి గుట్టుగా కూయుడు
కలిపికమ్ము లార । చెవికిచేర

ఆరు రుచులకు నాది ఉగాదియయ్యె
అన్నిటిని గూర్పు నలజడులణగిపోయి
సామరస్యము కలుగుట చాటునట్టి
తెలుగు పండుగ సాటి ఏదియును లేదు

పిజ్జాలను బర్గర్లను
బెజ్జాలను పెట్టుకోకు ప్రేగులకు హహా!
విజ్జోడు మామిచిగురుల
గొజ్జగిచవి కూతనిమ్ము కోయిల మాకున్

తనసిగదాల్చిన కమ్మని
ననలను తాచూడికుడుత నాంచారమ్మై
మనకిడుట నామె అక్కగ
కొనియాడును కొమ్మపైని కోయిల బళిరే!

పదిపది పొగడుట కాదోయ్
అది పెంచిన వాడెవండొ ఆ మాలిని నే
మది మెచ్చెద చెట్టెమ్మకు
గుదిగ్రుచ్చెద నుడుల దండ కొనుము వికారీ!

పండుగలన్నిట కొలువగ
నుండురి దేవులు 'నుగాది'కుండిరె యనగా
నుండెనట సృష్టికర్తయె
దండిగ పూజింప రండు తప్పనిసరిగా

# దేహమే ఒక దేశం

డా. ఎన్. గోపి
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
హైదరాబాద్

పరమ సంక్లిష్టం
అనేక జీవశాఖల సమాహారం
చట్టం, ధర్మం దీనికీ ఉన్నాయి
తరచుగా మనసు
వాటిని ఉల్లంఘిస్తుంది
సంచాలకుడెవడో తెలియదు

శరీరం
మనసుకు తొడిగిన వస్త్రం
అనుకునేవాణ్ణి.
ఇప్పుడు మనస్సే శరీరంలో
దారి తప్పి తిరుగుతుంది.
దేశమూ అంతే
రాజ్యాంగం కోసం వెతికేపని
నిరంతరం కొనసాగుతుంది.

నాలుక ఇన్ని భాషలు
మాట్లాడగలదని దానికే తెలియదు
ముఖ్యంగా అబద్ధాలు.

కనులు రెండు
కవల పిల్లల్లాగే వుంటాయి
ఒకదానికొకటి పడదు
చూపులు చీలిపోతాయి
అన్నట్టు ఇన్ని అశ్రువులు
ఇన్నాళ్ళు ఎక్కడ దాక్కున్నాయో అర్థం కాదు.

నిన్నటినుంచి
ఎడమచేయి అదురుతుంది
కుడిచెయ్యి సంతోషిస్తున్నట్టుగా వుంది.
గొంతుకు ఇన్‌ఫెక్షనట
పాట ఎక్కడికో ఎగిరిపోయింది.
ఇక మోకాళ్ళు
ఇవి దేశమంతా తిరిగాయి
ఈ మధ్య మెట్లంటే జంకుతున్నాయి
ప్రస్తుతం రేపటి చరిత్రలోకి నడుస్తున్నాయి.

పాపం కడుపు
ఎన్నిసార్లు నొప్పిని భరించిందో!
నిన్నటిదాకా శరీరంలో
కిడ్నీలు ఉన్నట్టే తెలియదు.
రక్తనాళాలు
నల్లాల్లా పాకురు పట్టాయి
ప్లంబర్ దొరకడు.

మెదడుది ప్రత్యేకమైన గొడవ
జ్ఞాపకాలు
పాతబల్బుల్లా మాడిపోతున్నాయి.
మధ్యలో ఆత్మ ఒకటి
దాని ఉనికి ఇప్పటికీ అర్థం కాలేదు.
అన్నట్టు దేశాన్ని
ఏకాత్మగా మార్చే ప్రయత్నాలు
ఓ కొలిక్కి రావటం లేదు.

శరీరంలో ఏ అవయవం
స్వాతంత్ర్యం ప్రకటించుకున్నా
అది మంచం ఎక్కవలసిందే.
రాష్ట్రాలకు వ్యక్తిత్వం ఎక్కువైతే
పార్లమెంటు ఎయిమ్స్‌లో చేరుతుంది.

కవిత్వం రాస్తున్నప్పుడు
బి.పి. పెరుగుతుందంటాడు డాక్టరు.
కవి శరీరం ఆగిపోతే
'నిన్నటిదాకా బాగున్నాడు
అర్ధరాత్రిదాకా మేల్కొని
కవితలు చెక్కాడు
అకస్మాత్తుగా
దేశాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు'
అని పత్రికల్లో వార్తలు వస్తాయి.

దేశం కాసేపు
కన్నీళ్ళు కారుస్తూ
గుండెమీద చెయ్యిపెట్టుకొని
తనను తాను
ఓసారి చూసుకుంటుంది.

# ఇల్లు కూడా మనిషిలాంటిదే!

డా. దేవరాజు మహారాజు
హైదరాబాద్

ఇల్లు కూడా మనిషిలాంటిదే
దానికీ బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఉంటాయి
ఇంటినిండా పిల్లలు కేరింతలు కొడుతున్నప్పుడు
అరవైయేళ్ళనాటి ఇల్లయినా సరే అది తన
వయసును మరిచి నవనవలాడుతూ కనిపిస్తుంది.
బోసినవ్వులు చిందిస్తూ, గజ్జెల గలగలలు
వినిపిస్తుంది.

ఆ ఇంట్లో యువతీయువకుల సరసాలు సాగితే
ఇంటి పెరట్లో మల్లెలు గుబాళిస్తాయి
ఆ ఇంటి చెక్కిళ్ళ మీద గులాబీలు పూస్తాయి
ఇంటిచుట్టూ దీపాలు వెలిగించుకొని, యవ్వనంతో
వెలిగిపోతూ
అర్ధరాత్రి దాటినా ఆ ఇల్లు నిద్రపోదు
బారెడు పొద్దెక్కినా నిద్రలేవదు

ఇంట్లో ఉండేవాళ్ళకు వయసు మళ్ళితే
అది కొత్తగా కట్టిన ఇల్లయినా సరే,
కీళ్ళ నొప్పులు, కాళ్ళ నొప్పులు, గుండెజబ్బులతో
బాధపడుతుంది!
దగ్గుల్లో, మూలుగుల్లో మునిగిపోయి
ఒక్కోసారి అది నిశ్శబ్ద గంభీరంగా ఉండిపోతుంది
అనుబంధాలు చచ్చిన ఇంట్లో ఆనందాలెట్లా
ఉంటాయి?
అనురాగాలు లేనిచోట జీవనరాగాలెట్లా ఉంటాయి?
నిస్సహాయత గూడుకట్టుకుని
ఆ ఇంటిముందు నిశ్శబ్దంగా వేలాడుతూ ఉంటుంది

చీకటితో పోట్లాడే సత్తువలేని ఓ గుడ్డిదీపం
వారి గాజుకళ్ళలాగా ఆ ఇంటిముందు
ఏదో ఆశతో దీనంగా మిణుకుమంటూ ఉంటుంది
పెందరాళే పడుకుని ఎటూ తోచక ఆ ఇల్లు
వేకువజామునే లేచి కూచుంటుంది!
ఒంటరితనంలో కొట్టుమిట్టాడుతూ
ఓ మాట కోసం ఓ నవ్వు కోసం అంగలారుస్తూ
ఉంటుంది!!

మరి మనుషులెవరూ లేనప్పుడు ఆ శూన్యగృహం
మాత్రం ఏం చేస్తుంది?
అది ఊపిరి పీల్చేదెట్లా?
అలికిడే లేనప్పుడు దాని గుండె కొట్టుకునేదెట్లా?
దాని నాడి నీరసించి, నీరసించి ఆగిపోతుంది కదా?
ఎముకలు వంగిపోయినట్టు దూలాలు,
మొగురాలు కృంగిపోతాయి కదా?
పైకప్పు వంగిపోయి వృద్ధాప్యంలో వంగిపోయిన
వెన్నుపూసను తలపిస్తుంది కదా?
ఆ ఇల్లు ఎంతకాలమని తనని తాను
కర్రపోటుతో నిలబెట్టుకుంటుంది?
దాని కండరాల గోడలు శుష్కించి, సడలిపోయి
చర్మం ముడుతలు పడ్డట్టు, పెచ్చులు ఊడిపోయి
ముఖద్వారపు నోరు వంకరపోయి
కిటికీల కళ్ళు బూజుల ఊసులతో
మూసుకుపోయి
తెరుచుకోలేక అదొక శిథిలదేహమైపోదూ?
అంతమౌతున్న శకాన్ని ఒక జీవనసారాన్ని
కరిగిపోతున్న ఒకప్పటి కేంద్రబిందువును గుర్తు
చేయదూ?

దాని ఆరోగ్యం బాగుపడాలంటే
దాని ఆత్మలో మళ్ళీ వెలుగులు నిండాలి!

ఎవరైనా వెళ్ళి నివసించాలి... ఓ చిన్నదీపంతో
ధైర్యం వెలిగించాలి.
ఆ వెలుగుతో అది తనను తాను
చక్కబరుచుకుంటుంది
వారి ఊపిరితోనే అది మళ్ళీ ఊపిరి
పోసుకుంటుంది
ఎప్పటికప్పుడు పునరుద్ధరణ జరగకపోతే
దేహమైనా, గృహమైనా, దేశమైనా జరిగేది
ఒక్కటే

నీ దేహాన్ని పునరుద్ధరించుకుంటే
నీ గృహాన్ని పునరుద్ధరించుకున్నట్టే-
నీ గృహాన్ని పునరుద్ధరించుకుంటే
నీ దేశాన్ని పునరుద్ధరించుకున్నట్టే-
దేహం, గృహం, దేశం అన్నీ మనం నివసించే
ఇళ్ళే కదా?
రండి! మనం మన ఇంటిని బతికించుకుందాం!!

# డ్యూటీ కాల్

- వర్ఖుల శివకుమార్
హైదరాబాద్

మేరీ జాన్ క్రైసే హెూ
కిటికీ పక్కనే ఉన్నా.
మంచులా మౌనం కూడా గడ్డకట్టుకుపోయింది
చెవిలో సెల్లుపిట్ట
గాలితరగలనుంచి నీ మాటల్ని ఒడిసిపట్టి
మనసులోకి
వంపుతుంది.
లోన వాన మొదలైంది
తరలిస్తున్న మా తలపులనిండ
డ్యూటీకాల్...
సాగదోలిన తొవ్వంతా నీ కన్నీళ్ళవాన.
నా కంటిపాపలమీంచి మీ ప్రతిబింబాలు జారి
అనుభవాల మడతల్లోకి ఒదిగినయ్.
తడిసిముద్దయిన జ్ఞాపకాల్ని ఆరబెట్టుకునే
తీరికే లేదు.
ఊహల ఊపిరిలోనూ అదే వాసన
ఒకింత పచ్చిగా అయినా వెచ్చగానే.

పిలుపొచ్చింది
లొకేషన్ పాయింట్ మీదే చూపు.
లైన్ ఆఫ్ కంట్రోల్ మీద సెర్చ్‌లైట్ ల నిఘా
అతిక్రమణల మీద పహారా
బయటి శత్రువుకీ లోపలి శత్రువుకీ
దేశమే టార్గెట్
ఏ వైపునుంచైనా తోసుకొచ్చే ఆపద
ప్రాణందేముంది
బ్యారెల్ నుంచి బుల్లెట్ జారేంతసేపు
ల్యాండ్ మైన్ మీట నొక్కేంతసేపు
దొంగదెబ్బ నిర్ణయం దూసుకొచ్చేంతసేపు
ఈ నిమిషం నన్ను కదిలించే
జీవధాతువు నీ తలపు.
నిరంతరం నన్ను నడిపించే శక్తి నా లక్ష్యం
నా ధ్యాసలో నువ్వు
దేశం ఆశంతా నేను

యుద్ధం రెండుదేశాల మధ్య ఐతే
పరిష్కారముంది
అతివాదాల ఆటయినప్పుడే
అగ్రరాబందుల బాటయినప్పుడే
మనిషితనం ప్రశ్నార్థకం
ఉన్మాదం ఉప్పెనై చెలరేగితే
ఊడ్చుకపోయే క్షణానికి హృదయముండదు.
ఉన్నట్టుండి ఈ కాల్ కట్ అయి
ఒక నిశ్శబ్దం ఆవరించవచ్చు.
మన సంభాషణ ఆగిపోనూవచ్చు
భయపడకు
అది మన లోలోపల సాగుతూనే ఉంటది

బహుశా ఏ అనూహ్య విస్ఫోటనంలోనో
తెగిపడ్డ దేహాలు, దేహాంగాలు
చివరి క్షణపు కలలు, కలవరింతలూ
నేలపాలైన నెత్తుటి పెనుగులాటలూ
మీ వెతుకులాటలకు దొరక్కపోవచ్చు
వెక్కిళ్ళకూ అందకపోవచ్చు
శత్రువు బాంబులను వదిలినంత అల్లగ
ఏ క్షణాన్నైనా ఉపగ్రహాలు ఈ వార్తను
ఉప్పందించి మరీ వదలొచ్చు
నిగ్రహంగా నిభాయించుకోండి.
నిలకడగా కూడదీసుకోండి

నిరాశను జయించడానికి
నిబ్బరమొక్కటే ఆయుధం.

రక్షణను బాధ్యతగా భుజానికెత్తుకున్న చోట
పోరాటాన్ని గ్లామరైజ్ చేసి
మా త్యాగాల్ని ప్రచారసాధనం చేసి
మా శవాల్ని సెల్ఫీలో బంధించి
ఓట్ల కోసమో రేటింగుల కోసమో
కాలం ఎగబడి కలబడొచ్చు

ఇప్పుడు మా ఆరాటాల్నీ ఆరోప్రాణాల్నీ వదిలి
మట్టిలో కలిసిపోతున్నా
రేపు మీ దారిలో
వెన్నెలపూల పండగౌతం.
ఆకాశంలో వేగుచుక్కలై పొడుస్తం.
మా కోసం రెండు కన్నీటిబొట్లు రాల్చండి
మా నడకకు పిడికెడు విశ్వాసాన్ని ఇవ్వండి
మేం దేశానికి కాపలా కాస్తాం
మీరు మా కలలకి కాపు కాయండి.

# బుర్క పిట్ట

**ఏనుగు నరసింహారెడ్డి**
తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి, హైదరాబాద్

ఉరికురికి అందుకుంటెనే
బుర్కపిట్ట గెలిచినట్టు
ఏ డోరూ చిక్కనీయని
డబుల్ డోర్ల తరుములాటకు
ఫర్లాంగంత పరుగు
డాలర్ కలల మొదటిమెట్టుకు
కట్టగడితే ఆగిన కాల్వ
స్టైతస్కోపు మాలలముందు
టోకన్లో దాచుకున్న ప్రాణం
వేగాన్ని వెక్కిరించే
నడిబజారు అడ్డుదీపం మీద
గింజుకునే అశక్తత
ప్రతిమలుపు పీకల మీద ఎడతెగని క్యూ
మనుగడ ఇప్పుడో మ్యూజికల్ ఛైర్
పట్నం పాపిట్లో మురికి ప్రవాహం

నడక దేనికీ సరిపోదు
పరుగు దేనినీ అందుకోదు
బుర్కపిట్ట ఎగిరెగిరి దుంకవలసిందేనట
కాలువ పల్లానికే పారుతుందనుకున్న
మంచి రాముడా
ఒకవైపు వంపు చేయబడ్డట్టుంది

కొట్టుకుంటే తప్ప నిలువలేనితనం
పోల్చుకుంటేనే తేల్చుకునే లోకం
ఏదైనా ఎగబడి గుంజాల్సిందేనా
చిట్టి పాదాల చెల్లి తంతే

మురిసిన అక్క కాటగలిసింది
తమ్ముణ్ని ఊరేగించిన అన్న
ఆగమయిండు
అరికాళ్ళకు చెప్పుల్లేకుండా
తోటలో మురిసిన కాలాన్ని
బూచెత్తుకుపోయింది
పిల్లబాటలో అరికట్నంతో
చల్లగాలిని తుత్తునియలు చేసిన తొవ్వ
తప్పిపోయింది
ఇంటికి బడికి నాలుగుసార్లు అంగలేసి
ప్రయోగశాలలో ఆనందాన్ని కొలుచుకున్న
లెక్కలు కిందమీదైనై

జెగ్గల గాట్లకు చిచ్చ్ కొడుతూ
తాడెక్కి పండ్లు తెంపినం
పత్తిపెన్ను ఒక్క ముక్కిరిగి
నిప్పులమైపోయినట్టు
మన సొక్కం సౌందర్యమంతా
కనిపించని కత్తియుద్ధాలలో
చిక్కుబడిపోయిందా
ఇప్పుడు కొత్త కొలతల్తో గంతులేస్తేనే
ఏదైనా అందుతుందంట
ఎవన్నైనా ఎనక్కు తోస్తేగాని
మనం ముందున్నట్టు కాదట
ఇప్పుడు అన్నింటికీ
రూపం మారినట్టుంది
సఖుడా!
మరిప్పుడు
బాగా ఆలోచించు
సరిగ్గా
బుర్కపిట్ట ఎర్కజెప్పు

# ఈ ఉగాది నవయుగాది!

**వద్దేపల్లి కృష్ణ**
కవి, సినీ గేయ రచయిత
హైదరాబాద్

పల్లవి : ఈ ఉగాది నవయుగాది!
ప్రకృతికే శుభయుగాది!
ఆకురాలు కాలమణగి
ఆమని విరిసే ఉగాది

చరణం : ఎలకోయిల కూజితాల
ఎలుగెత్తే స్వాగతాల
హరిత ఆమ్రతోరణాల
భరిత మల్లికాసుమాల
ఏతెంచే వాసంతీ!
చెలువంలో చేమంతీ!
విలాసముగ ఇంటింటా
విహరించే విరిబంతీ!

చరణం : పులుపు-తీపి-వగరు-చేదు
కలగలిసిన షడ్రుచుల
పచ్చడి రుచి చూపించే
బ్రతుకుతెరువు నేరిగించే
చైత్రమాస తీరమా!
చైతన్య సమీరమా!
తీయని ఊహల దేలగ
హాయిగ దరిజేరుమా!

# భయం

**- రాపోలు సీతారామరాజు**
దక్షిణాఫ్రికా

1. **ఆదిమమానవుడు**

జంతువులకు భయపడి
ఆయుధం పట్టినా
అకలి తీర్చుకోడానికి
అదే జంతువుల్ని వేటాడం మొదలెట్టాడు!

చలిపులికి భయంతో వణికి
చర్మాన్ని కప్పుకున్నా
వస్త్రాన్ని నేయడమూ నేర్చాడు!

వానకు తడిసి ఎండకు జడిసి
కొండగుహల్లో తలదాచుకున్నా
అనుబంధాలే పునాదిగా
అనురాగాల ఇంటిని కట్టుకున్నాడు!

ప్రకృతి విలయాలకు భయపడిన
దశ నుండి ప్రకృతినే శాసించేలా ఎదిగాడు!
ఏకాకిలా బతకడం మాని
సమూహ జీవన సారాన్ని
ఒంటపట్టించు కున్నాడు!

అడుగడుగునా భయపడే స్థితి నుండి
భయానికే భయం పుట్టించే
స్థాయికి చేరాడు!

అనాగరికతా అగాధాలనుండి
అభివృద్ధి శిఖరారోహణ చేస్తూ
నాగరికతా గమ్యాన్ని తాకాడు!

2. **నవీన నాగరికుడు**

ఉండటానికో ఇల్లు చాలదంటూ
విశాల భవనాలెన్నో కడుతూనే ఉన్నా
మనసుని మాత్రం
సంకుచిత పంజరంలో బంధిస్తున్నాడు!

స్వార్థానికి బానిసలా మారి
సంఘ జీవనాన్ని సహించలేక
సాటి మనిషిని వద్దంటున్నాడు

అభివృద్ధి పేరుతో
ప్రకృతిని వికృతిగా మారుస్తూ
వినాశనాన్ని ఆహ్వానిస్తున్నాడు!

రక్షణ కోసం వాడిన
ఆయుధంతోనే
సాటి మనుషుల కుత్తుకల్ని
తెగ్గోస్తున్నాడు!

మనిషిని చూసి మనిషే
భయపడే విపరిణామంతో
రోజురోజుకి భయంతో బతుకులీడుస్తూ
ఆదిమసమాజం వైపు అడుగులు వేస్తున్నాడు!

# సౌందర్యం

అన్నవరం దేవేందర్
కరీంనగర్

వీస్తున్న గాలి ప్రవహించే నీళ్ళు
పరిభ్రమించే నేల
పరిసరాలు ఇసిరెలు ఎవల స్వంతం!
ఈ భూమ్మీద అందరూ అతిథులే

నాకున్నయి రెండురెక్కలు నాలుగెకరాలు
తాతల తండ్రుల కాలం నుంచీ
చెలక దున్నకమే వ్యాపకం
పంటలు పండించడమే ఇలవర్స

నాలుగు సాల్లు ఇరువాలు దున్ని
మానెడు గింజలు మంట్లె పోస్తే
ఇంట్లకు ఇద్దుము వడ్లు వచ్చిన కాలం
ఈ ర్యాగడి లోకానికే అన్నం గిన్నె

ఎడ్ల నాగండ్ల ఎనుకనే తాత జీవితం
అక్షరాల సాల్లు పోసిన నాయిన గురుత్వం
అనాదినుంచీ ఆకలి తీర్చడమే ఆనవాయితీ
సేవా ఉత్పత్తులతోనే చేతులు మమేకం

ఈ మక్క పెరడుకు హక్కుదారుడెవడు
ఈ చింతపులుపు ఎందరు సైసూసింద్రు
ఈ నది నాగరికత అనంతకాల పారకం
చల్లని జాబిలి నీ ఒక్కనిదా ఏంది?

తాపకోసారి నాది నాదనే హద్దుల ఆలాపనలు
అసలు భూమి వయసెంత, నీ వయసెంత
ఆరడుగుల నేలనే నీ తదనంతర స్వంతం

మాటల చేతలు మమకారాలే నిలిచే చరిత్ర
ప్రకృతితో మమేకమైతేనే జీవన సౌందర్యం

# నవ యువ సైనికులు

– డా॥ తలతోటి పృథ్వీరాజ్
కవి, విమర్శకులు, అనకాపల్లి

అన్నీ ఉన్నా ఎందుకో
ఏమూలనో అసంతృప్తి... అలజడి...!

అంతా బాగున్నా
ఎక్కడో అభద్రత...భయం...!
నీడలా వెంబడించే పరాయితనం!!

ఖండాంతరాలలో కాలుమోపడం
నిజం అయిన స్వప్నమే అయినా
వెంటాడే పేగుబంధం
మాతృభూమి!

సుందర పర్వత సానువులే అయినా
ప్రకృతి ఆస్వాదన వైపు మనసుండనట్టు
గస్తీ కాచే సిపాయి అనిశ్చిత స్థితిలా
అందరికీ చెప్పుకోలేని కొన్ని సమస్యల్లా
కొన్ని అంతే!
చెప్పాలనుకునేమాట గొంతుకాడే ఆగినట్టు
మెలకువ వచ్చినా లేవలేక మగతగా
నిద్రించినట్టు
కొన్ని కొన్ని అంతే ...
మాటకారినీ మూగను చేస్తాయి
సర్దుకుపోయే అలవాటు సంకెళ్లు వేసి
ఆ దేశవాసుల్నిచేస్తాయి.

ఎక్కడైనా ఒకటే నేల కదా!
ఎక్కడైనా అదే మనుషులుకదా

అనేవారు లేకపోలేదు!
నేల నేలకు నీటి రుచిలో తేడాలా
మనిషి మనిషిలోని మానవత్వ వ్యత్యాసంలా
భాషకు, సంస్కృతికి, వర్ణానికి, తెగకు మధ్య
కనబడని కందకాలు, ఊబిలున్నాయి.
అవే ఆదిమ కాలంలో
మనుషుల్ని సంఘజీవిని చేసినట్టు
సంఘాలుగా సంఘటితం చేశాయి
సమూహంగా ఐక్యపరిచాయి
శక్తిగా నడిపిస్తున్నాయి.
ఐక్యతే భద్రతా వలయం!

సుదూరాలలోని దగ్గరివారి గొంతుకలు
రోజూ వింటున్నా
కళ్ళముందు కదిలే చిత్రాలుగా
చరవాణుల్లో పలకరిస్తున్నా
సుదూర దారం ఆ కొస అందుకున్నా
అవి ఆత్మీయ స్పర్శలుండని
ఉపశమనాలే!

ఏళ్ళ తర్వాత
ఏదో బలమైన సందర్భాన్ని బట్టి
సొంతగడ్డపై కాలుమోపాల్సిన పరిస్థితి
మాతృభూమి ఒడికి చేరుస్తుంది.

వలస పక్షుల్లా
దూరాల్ని చెరిపి వచ్చివెళ్లే అమ్మ నాన్నలు.
వారు తిరిగెళ్లిన నాలుగైదు రోజులపాటు
వెంటాడే వెలితి.
చూస్తూ ఉండగానే కుదురుకున్న
నదిలోని తరంగాలలా
మదిలోని అంతరంగాలు
కొన్ని దినాలకు యధాస్థితికి.
గాయం రేపేది, మాన్పేది కాలం.
కాలం గొప్ప వైద్యుడు!

ఏదో ఆశ, మరేదో లక్ష్యం
నడిపిస్తే నడిచినవారు
పౌరసత్వమేదైనా
అంటుగట్టగా పూసిన గులాబీలు
స్వదేశం - విదేశాలను కలిపే
సాంస్కృతిక వారధి వీరు.
విదేశ సంస్కృతి మోహంలో కొట్టుకుపోయే
స్వదేశీయలకు ఆదర్శం
కనిపించకుండానే దేశ ప్రగతిలో
తమ ధర్మాలను నిర్వర్తిస్తూ
వచ్చి వెళుతూ ఉండే ఋతువులు...

ప్రతికూల పరిస్థితులెన్ని ఉన్నా
దేశాన్ని రక్షించే సైనికుల్లా
దేశ సంస్కృతిని, భాషా సంపదను
పరిరక్షించే నవ యువ సైనికులు వీరే!

# మది పలికే భావాలు

*తండ హరీష్ గౌడ్*
గూడూరు, మహబూబ్ నగర్

గాలికి అతుక్కున్న కన్నులు
ఊయలెక్కి ఊగుతున్నాయి సరే
అనంతాకాశం నుండి రాలే
నీటిబిందువుల జాడలకు
ఎవరు వెళ్ళారు...
మేఘాలేననుకుంటా!!

ఏం పట్టుకొస్తాయో
నీరునో...కన్నీరునో...

సాయంత్రాన్ని సాపగా చేసి కూర్చొని
నాలుగు మాటల జల్లులు చిలకరించుకునే
ఆ కళ్ళనడగాల్సిందే...
మదిలో పలికే భావాలెన్నని...

శిఖరాన్ని ముద్దాడాలని వెళ్తూ
ప్రాణవాయువును మోసుకెళ్ళాల్సిందే
నీకు తెలియంది కాదు...
నీది కాని ప్రదేశంలో నువ్వు
పతాకమై మొలవాలంటే...

ఏమో నీ మనసుపొరలను
బత్తాయిలా విప్పినప్పుడు
ఒక్కోసారి తీపికొడుతుంటావు
ఒక్కోసారి తెలియని రుచిని అంటకడుతుంటావు

నేనిప్పుడు భావాలు గుప్పుమంటున్న
మదులను మదిస్తూ
ఆకాశానికి, భూమికి మధ్య వేలాడుతున్నాను
చివరకు
నన్ను ఒడిలోకి తీసుకునేది
ఆకాశమో, భూమో...?

# పై...చేయి

- డా. కె. ఎల్. వి. ప్రసాద్
హన్మకొండ

వయసు మళ్లిన
శరీరాన్ని చూచి
యవ్వనం కోల్పోని,
మనస్సు...
అంతర్గతంగా
అల్లుకుపోయి ఉన్న
కోర్కెల తేనెతుట్టెను కెలికి
అప్పుడప్పుడు,
ఉలికిపడేట్టు చేస్తుంది!

ఉహించని
ఈ హృదయ స్పందనలకు
ఎక్కడిదో ఒక కొత్త మనస్సు
ఉత్ప్రేరకమై
అప్పుడప్పుడు
ఉక్కిరిబిక్కిరి చేస్తుంటుంది

వయస్సును
మరచిపోమంటుంది
ప్రేమను పంచే
హృదయకవాటాలను
తెరవమంటుంది

నిద్రాణమైవున్న
యవ్వన ప్రేరణలను
తన
అల్లరి ఉత్తేజాలతో
తట్టి లేపుతుంది

అమాయకంగానో
అదుపుతప్పిన
మనస్సుతోనో
ఆ...రెండు శక్తుల మధ్య
ప్రేమ
స్వేచ్ఛా విహంగమయి
హద్దులు దాటి
సుద్దులు చెప్పేవరకూ
హాయిగా విహరిస్తుంది.
మనసుదే...
పై...చేయిగా నిలుస్తుంది!!

# పడమటి తిలకం

- పుట్టి గిరిధర్
మహబూబ్ నగర్

రోజంతా శ్రమించిన చెమటచుక్క
పడమర తిలకమై మెరుస్తుంది!
మరో లోకానికి పొద్దునిస్తూ
అలసిన రెక్కలపై
చీకటిదుప్పటిని కప్పుతుంది!

మెరిసే చుక్కలను కలుపుకుంటూ
సంపాదించిన వెన్నెలముగ్గును
బతుకు వాకిలిపై దిద్దుతుంది!

మట్టిలో జీవితాక్షరాలు నాటిన దేహం
రేపటి ఆశలపంటకై కలలు కంటుంది,
నిద్రలో మెలకువగా ఉన్న కళ్ళు
కాదన్నా రాత్రిళ్ళు కాపు కాస్తుంటాయి!

కాలమెప్పుడు కాటేసినా
ఆఖరి ఊపిరి సైతం
కన్నీటిపడవను కదిలిస్తుంది,
ఓటమిదారుల వెంటైనా
గెలుపుతీరాలకై వెతుకుతుంది!

జననం మరణం జీవి లక్షణం
మధ్యన పోరాటం జీవిత లక్షణం!

# టీ కొట్టు దగ్గర

**మెట్టా నాగేశ్వరరావు**
బయ్యనగూడెం, పశ్చిమ గోదావరి

చీకటి పడుతున్నప్పుడు
పక్షులన్నీ చెట్టుకొమ్మలపై కువకువలాడుతూ
గుంపులుగా వాలినట్టూ
ఏ అర్ధరాత్రో నిద్ర భగ్నమైనోళ్లు
వేకువనే బతుకుభారం భుజానేసుకొచ్చినవాళ్లు
తెరల తెరల చీకటి వెలుగులో
టీ కొట్టు చెంతకు చేరతారు
తలపోతలేవేవో వెచ్చపెట్టుకుంటూ
పలు సత్య వాక్యాల పాఠమవుతూ!

లోకాన ఉదయించే తొలిసూర్యుడు
యీ టీ నీటి పొయ్యే!

లోకం కథలు మోసుకొచ్చే పత్రికల కట్టలు
ముడులు విప్పుకోక ముందే
పంచదారపొట్లం దారం విప్పుకునేదీ
వందగడపల పల్లెలోనైనా
ముందుగా వెలిగే పొయ్యి టీ పొయ్యి!

అమ్మలెవరూ ఎసరుపెట్టకముందే
కమ్మటి వాసనతో ఇక్కడ డికాషన్ మరుగుతూ
వేడి వేడి కబుర్లవుతుంటే...
టీ కాగేలోపు ఇంటింటి రామాయణాలెన్నో
పారాయణాలయ్యే ఆ చోటా...
కష్టాల్ని ఏకరువు పెడుతూ ఒకడు
ఇంకొకడు ఎలా కష్టపెట్టాడో చెబుతూ
మరొకడు!

అక్కడ చెలిమితాడు తెగిన వాళ్ళు
మాటలమంటలై చిటపటలాడుతుంటే...
నిప్పుపై నీళ్లుచల్లి ఆర్పినట్టు
వాళ్ళ కోపతాపాలు ఆరిపోయేలా
అన్ని టీ నీళ్లను చేతికిస్తూ దుకాణందారు
నవ్వుముఖం సంధిస్తాడు!

పొద్దు పొద్దునే పొగలు కక్కే తేనీరు
పెదాల్ని తాకగానే
మౌనంగున్న ఏ పెద్దమనిషైనా మాటలవరదై
మనిషి మూలాల చరిత్ర పుటలు విప్పేదీ!

జాతరలో జనం కూడినట్టూ
మనిషితనం సందడి చేస్తున్నదీ
ఈ టీ కొట్టు వద్దనే గదా...!
పిడికెడు మానవత్వం
చా పైసలై బిక్షగాడి దోసిట్లో చేరి
ఆశీస్సులదండకమయ్యేది ఇక్కడే మరి!

ఎవడి గదిలో వాడుఎవడి సోయిలో వాడు
కొట్టుకుపోయే కాలంలో
టీ కొట్టు దగ్గర మనుషులు కలిసివున్నట్టు
నా కనుపాపల్లో...
కాలంబొమ్మ కదులుతుంటుంది!

ఏకాకితనం వేధించినప్పుడల్లా
టీకొట్టు దగ్గరకే వెళ్తాను
టీ తాగి వస్తూ వస్తూ
మనిషిని నిలబెట్టే గుప్పెడు మాటలమూటల్నీ
మనిషితనం అంటుకట్టే చేరెడు
వాక్యాలతీగల్నీ వెంట తెచ్చుకుంటాను...!

# జై జవాన్

- ఎస్. కె. రజియా
అహల్యా, నల్లగొండ

జగద్రక్షకులు ఆ దేవుళ్లైతే
దేశ రక్షకులు ఈ జవానులే కదా
ఎండావాననక ఎల్లలుకాస్తారు
శత్రుమూకలను చీల్చి చెండాడుతారు
దేశరక్షణ మా ధ్యేయమంటరు
దేశం కోసం ప్రాణాలిస్తుంటరు
శత్రువు ప్రాణాలు తీస్తమంటరు
మరుభూమిలో మా ప్రయాణమంటరు
ఉగ్రమూకల్ని తరిమేకొడతరు
వీరత్వానికి విక్రమార్కులంటరు
ధీరత్వానికి చక్రవర్తులంటరు
శత్రువులకే దడపుట్టించే అభిమన్యు
సోదరులంటరు

దేహాన్ని హింసించినా
దేశరహస్యాలు త్యజించరు
వూపిరి పోయేవరకు
దేశమాతనే రక్షిస్తుంటరు
చివరి శ్వాసనే గట్టిగవూది
మనజెండానే రెపరెపలాడిస్తరు

ఈ అమ్మ మోసేది నవమాసాలు
మరి ఆ అమ్మ మోసేది కడవరకు
ఈ రుణం తలకొరివితో తీరును
ఆ రుణం తీర్చుకోవాలని
జవాను అవతారమెత్తాడు

యుద్ధంలో మువ్వన్నెల జెండా ఎగరేస్తాం
లేదంటే
జెండా కప్పిన దేహంతో తిరిగొస్తాం

త్యాగ వీరజవానుల రుణం ఏమిచ్చి
తీర్చుకోగలము?

ఓ త్యాగమూర్తులారా...
ఎన్ని పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించిన
తక్కువేకదా మీ త్యాగాల ముందు

ఓ వీరజవానులారా...
ఎన్ని స్ఫూర్తి గీతాలు ఆలపించినా
తక్కువే కదా మీ సాహసాలముందు

ఓ ప్రాణదాతలారా...
నిద్రాహారాలుమాని
దేశంకోసం పహారాకాసే
మీకెన్ని ప్రణామాలు చేసినా
తక్కువే కదా

జై జవాన్! జై జై జవాన్!!

# ఉగాదెరుగని వనం!

*డి. నాగజ్యోతి శేఖర్*
మురమళ్ళ, తూర్పు గోదావరి జిల్లా

దిగుళ్ల కొమ్మకు పూసిన గుబులు పత్రాలు
గీతలు చెరిగిన భవిత రాతల్ని వెతుకుతూ
రాలిపోతున్నవి!

శ్రమల ఋతువులు కబళించిన
బతుకు దేహాలు
చెదిరిన జీవ పచ్చదనాన్ని స్వప్నిస్తూ
స్వేద తరువులై
దుఃఖ జిగురు స్రవిస్తున్నవి!

వెతల ఒంటరితనాలు మింగిన జవసత్వాలు
విడుదల వాయువుల్ని పోగేసేందుకు నరాల్ని
మెలిపెడుతున్నవి!

నెత్తురు ఇంకిన పేగులతీగల్లో ఆకలి గీతాలు
సంతుష్టి రాగాలు తీయాలని
గొంతులు తెగ్గొట్టుకుంటున్నవి!

కనబడని కోయిల వైనంలా
నెరవేరని హామీల స్వరాలు
ఎక్కడో సుదూర తీరాల్లో
తీపి వరాలు కురిపిస్తూ
ఆశల పాదాల్ని పరుగులెత్తిస్తున్నవి!

బొబ్బలెక్కిన పేద పెదవి సాక్షిగా....
దప్పిగొన్న ఆ శుష్క జిహ్వపై
దగా చేదు చిరక నర్తిస్తుంటే....
మింగుడుపడని శిశిర విషాన్ని కొద్దికొద్దిగా
శోషించుకుంటూ....
కృశిస్తున్న బడుగు బతుకువనం
తీరని తృష్ణల తీరంలో
న్యాయ చెలమకై
తవ్వుతూ....
ఉషస్సులెరుగని ఉగాదై
వాడిపోతూనే ఉన్నది!

విధి గుప్పెడు వెలుగు వాసంతాలని విదిలిస్తే
గానీ
అసలు ఉగాది
ఆ నిరాదరణ హృదయ వాకిలిలో విరియదు!
అంతవరకూ అక్షర ఆమని తోడుగా
బీడు మన్నులో కాసిన్ని ఓదార్పు చినుకులు
జల్లుదాం!

# చౌరస్తాలో గాంధీ!!

'వెన్నెల' **సత్యం**
షాద్‌నగర్

ప్రజా ధనాన్ని మెక్కిన
రాజకీయ కాకులు
నా తల మీద రెట్టలు వేస్తున్నా
చేతికర్రతో కొట్టలేకపోతున్నాను!

నా ఒంటి మీదంతా పేరుకుపోయిన
అవినీతి అక్రమాల దుమ్మూ ధూళీ
దులుపుకోలేక అలసిపోతున్నాను!

నడిరోడ్డు మీద జరిగే
అత్యాచారాలూ హత్యలూ
నేను చూడొద్దనే కాబోలు
నా కళ్ళజోడుకి అద్దాలు బిగించక
ఒట్టి ఫ్రేమునే తగిలించారు!

డెబ్బై ఏళ్ళ తర్వాత కూడా
ఏ ఆచ్ఛాదనా లేని దేహాలతో
నాలాగే ఎండకు వానకు చలికి
తట్టుకుంటోన్న దీనులను చూస్తుంటే
వీళ్ళే నాకు అసలు సిసలు
వారసులేమో అనిపిస్తోంది!

హేరామ్ అంటూ నా గుండె
ఆగిన క్షణంలోనే ఆగిపోయిన
నా నడుముకున్న గడియారం
ఎక్కడి గొంగళి అక్కడే
సామెతకు సాక్ష్యంగా నిలిచింది!

ఏడాదికోసారి మెడలో పడే
పూల దండలన్నీ ముళ్ళయి
ఎదపై గుచ్చుతున్నాయి
ఈ నాలుగు రోడ్ల కూడలిలో
నేనింక నిలబడలేను!

నేను కన్న కలలన్నీ
కల్లలయిన చోట
ఒక్క క్షణం ఉండలేను!
స్వాతంత్ర్యం అందించినందుకు
ఈ చౌరస్తాలో నన్ను బంధించి
నాకు తగిన శిక్షనే వేశారు!

అందుకే ఇక్కడి నుండి
పరుగు తీస్తున్నాను
నా దారిలో నడిచే
నలుగురున్న చోటు కోసం
వెతుక్కుంటూ...!!!

# వసుధపంచాంగమా! శుభవార్తలిమ్మ!!

కిలపర్తి దాలినాయుడు
సాలూరు, విజయనగరం జిల్లా

తే.గీ.: కారు కోయిల కమ్మని-గానరవళి
చేరు మాకర్ణపుటములు-మారుమోగ
లేత మామిడి చివురుల-లేపనమును
తినుటచేతనుపాటకు-తీపి హెచ్చె!

తే.గీ.: గుమ్మముల్ ముద్దు గుమ్మలై-
కొమరుమీరు
మావి యాకులపచ్చల-తావులౌను
తీపి,వగరు,చేదు,పులుపు-తీరమందు
నుప్పు కారముల్ పచ్చడి-యొప్పుగాను!

సీసము: చైత్రమా! చైత్రమా! చైతన్య మాసమా!
వాసంతివైవచ్చివరములిమ్ము!
మన్మధా! మన్మధా! మానసోల్లాసమై
యువజంటలనుపూని-యూపునిమ్ము!
కోయిలా! కోయిలా! క్రొంగ్రొత్త రాగాలు
వినిపించివీనుల-విందు సలుపు!
వర్షమా! వర్షమా! హర్షాతిరేకమై
యేరువాకనుకోరిచేరవమ్మ!
వసుధపంచాంగమా! శుభ-వార్తలిమ్మ
రాజపూజ్యము బెంచియు-రాశులిమ్ము
వెతలు లేకుండ రాబడి-పెంచుమమ్మ
కాలపురుషుడా! విజయవికాసమిమ్ము!

సీసము: తడబాటులేకమా-దాతరైతన్నకు
సస్యాంబరములిచ్చి-సాకుమమ్మ!
నగుబాటులేకమా-నాతికష్టంబును
తొలగించి ధైర్యాన-దోడురమ్మ!
యెడబాటులేకమా-యెడదల ప్రేమను
నింపిసంసారంబు-నిలుపుమమ్మ!
పొరపాటుపొరలలో-పోయికూరుకుపోవ
వెఱవులేకుండగా-కరుణజూపు!
ఆది యంతములేనట్టి-యానకమున
కాలవాహినికదలిక-గణన జేయ
పుట్టినావుయుగాదిగా-పుడమియందు
కాలమానినిగొల్చెడి-జాలమీవు!

# కన్నీటి ముత్యం

డా. తాటిపర్తి రజనీకాంత్ రెడ్డి
దక్షిణాఫ్రికా

క్షణభంగుర జీవితముపై
వగచి
కడలి ఒడిలో కలవబోయిన
చిన్నారి వానచినుకును
వారించి
ఓదార్చి
అక్కున చేర్చుకుని
అందలమెక్కించెను
ఒక ముత్యపుచిప్ప!

ఓ చెలీ!
నా కన్నీటి చినుకును
అటుల కరుణించి
నీ గుండె పొత్తిళ్ళలో
పొదిగి
అమరత్వమునీయుమని
వేడుకుందు!!

# వసంత కోయిల

- శాంతి కృష్ణ
హైదరాబాద్

కొత్త రాగమేదో తీస్తోంది
కోయిలమ్మ...
చిరు చిరు వెలుగులతో
చేవ్రాలు చేస్తున్న
తొలి కిరణపు కవ్వింతలతో...

నిన్నటి తుషారపు చినుకుల్లో
ఎంత ఘాటుగా తడిసిందో మరి
గొంతు సవరించుకుని
మరీ గీతమాలపిస్తోంది..

కోయిల స్వరాలతో ఉలిక్కిపడి
సోయగాల సోకులతో
శిశిరానికి వీడ్కోలు పలుకుతూ
వసంతుని ప్రేమగా
స్వాగతిస్తోంది ప్రకృతి కన్య...

మూగవోయిన గుండెలో కూడా
పల్లవిస్తోన నిరుటి జ్ఞాపకాలు...

ఎవరికుందదు ఎదనిండా
పరిమళం నిండాలని
సడిలేని బతుకులో
సప్తస్వరాలు సవ్వడించాలని...

నేస్తమా...

నా మనసిపుడు
నీ ఆగమనానికి
ఆహ్వానాలంపుతూ
కొత్త ఏడాదికి
స్వాగతం పలికే
వసంత కోయిలయ్యింది...

# ఉగాది జరుపుకుందాం

**సరిత నరేష్**
నల్లగొండ

అవునా అప్పుడే వచ్చిందా ఉగాది!
వసంత మాస చైత్రపు గాలితో చిత్రంగా
వచ్చిందీ ఉగాది
ఈ ప్రపంచాన్ని ఏలే ఛీ'కాకుల' నడుమ
కాకుల కావు కావు గోలలే వినబడుట లేదు
వసంత కోకిల గాత్ర స్తోత్రం వినబడేది ఎక్కడ?
సరిహద్దే మరచిపోయిన (అ)నాగరిక జీవనం
ముంగిట
వసంతమాసం వచ్చి ఏం లాభం?

పచ్చని చివురుమావి తోరణాలు ఏవి?
ఎటు చూసినా ఎండమావుల
మనసులవుతుంటే...

అసలు అడవుల ఊసేది?
అంతా అపార్ట్ మెంట్ మయమైన కాంక్రీట్
జంగిల్ దర్శనమిస్తుంటే...

ఆ తియ్యని పరమాన్నాలు, పాలబువ్వలు ఏవి?
పంట చేతికి రాకముందే ప్రళయం
వెక్కిరిస్తుంటే...

తాతా అవ్వల నవ్వుల గలగలలేవి?
బువ్వలేని వారి వెర్రి చూపులు తప్ప...

వలస వచ్చే గువ్వల సవ్వడేది?
మోడువారిన వృక్షరాజాల దీనగాథ తప్ప...

తియ్యతియ్యని సజ్జల సంకటి ఏది?
తమ బొజ్జనిండితే చాలనుకునే స్వార్థ
రాజకీయం తప్ప...

రామచిలుకల తీపి పలుకులేవి?
ఆకలి చావుల కేకలు తప్ప...

షడ్రుచుల పానక పచ్చడి ఎక్కడ?
కల్తీమయపు కూల్ డ్రింకులే తప్ప...

భక్ష్యభోజన తంబూలాదులు బంధుజన
అనురాగాలేవి?
యాంత్రిక బ్రతుకుకు బంధీలైన జనం తప్ప...

మనసుల ఆశల ఊసులు పండేదెక్కడ?
అనునిత్యం ఆవేశపు రాకాసి వేట తప్ప...

డాలరు డాంబికం ముంగిట
చిన్నబోయిన రూపాయి విలువ

సంస్కారం కొరవడిన చదువుల మాయా పోటీ
ప్రపంచంలోకి
పంచాంగం లెక్కలు తలక్రిందులయ్యే సరికొత్త
వేదాంతాలు

అంతుచిక్కని హత్యలు ఆత్మహత్యలే వేడుకలు
రోజుకూలీ కూడా దొరకని ఎండే డొక్కలు

జ్వలిస్తున్న రైతు కడుపుమంటలు
అంపశయ్యపై ఆడకూతుర్ల జీవితాల నడుమ
ఎంతో అట్టహాసంగా
ఈ పరిస్థితిని మార్చడానికి చేతగాని
చేవ చచ్చిన మనం
చలాకిగా జరుపుకుందాం ఉగాది

# వసంతానికి స్వాగతం

- మల్లేపల్లి ప్రమోద్ కుమార్
షాద్‌నగర్

సీ.
మల్లికా సుమపుంజ మధుర గంధమ్ములు
మహియంత హాయిగా మలయుచుండ
మధుదూత కుసుమాల మనసు దోచెడు గాలి
తనువులన్ ప్రేమగా తడుముచుండ
చిగురాకులే తాను చీరలా ధరియించి
ఆ వృక్ష రాజమ్ములలరుచుండ
కొమ్మ మాటున దాగి కోయిలల్ మత్తుగా
కుహుకుహూ రాగాలు కూయుచుండ

చిలుక పలుకులు జగతిలో చిందులేయ
శారికా కలస్వనములు శాంతి గూర్ప
ప్రకృతి కాంత సంతసమున పరవశింప
వచ్చెనదిగో వసంతమ్ము వసుధ మరువ

ఉ.
వెన్నెల వర్షముల్ గురిసి వేదన గల్గెను పూరుషాళికిన్
కన్నెల మానసమ్ములను కాముడు దోచెను జాలి లేకయున్
వన్నెల నొల్కబోసినవి వంతులవారిగ పక్షిరాజముల్
కన్నుల పండుగాయెనిట కమ్మని యామని యాగమమ్మునన్

# నిరీక్షణ!

- సర్ఫరాజ్ అన్వర్
హైదరాబాద్

మండువేసవిలో దాహముగొన్నగొంతు
చల్లదనానికై తపిస్తుంటే
వేసవితో అలసిన ఈ దేహం
శమనఉపశమనానికై
ఉప్పెనయై ఉరకలెత్తుతుంటే
మామిడి పూత, పిందెలతో పాటే
నువ్వు కూడా బిందెల నిండా
సంతోషాల నవ్వుల్ని మోసుకొనివస్తావని...

చాడీల జాడీలు, మాటల గారడీలు
గుమ్మరించి గుమ్మరించి చప్పబడినజిహ్వా
పునరుత్తేజితమవడానికి
పచ్చడి షడ్రుచులకై జాగరణ చేస్తుంటే
మనుషుల మాటల మతలబుల మతాబులు
వాహనాల రణగొణధ్వనుల్ని
విని విని విసిగిపోయిన కర్ణాలు
వసంత కూజితరాగాల కోసం ఎదురుచూసినట్టు
నేను కూడా నీకై ఎదురుచూస్తున్నాను
ఆత్రుతతో...

పెరిగిపోతున్న వేడిమిని
తరిమి తరిమి కొట్టి
ఓరిమితో ఆత్మీయతానుబంధాల్ని
గుండె లోతుల్లో నుండి తడిమి చూసుకొని
ఆత్మీయతల్ని స్పృశించే నీ చల్లని చూపులకై
సంస్కృతీ సంప్రదాయాల ప్రతిబింబమైన
నీ ముఖరావింద దర్శనభాగ్యం కోసం
నేను ప్రతి ఏడాది వేచిచూస్తుంటాను...

శిశిరంలో పత్రాలన్నీ రాలిపోయి
మోడువారిన వృక్షాలపై చిగురుటాకులు
పూసినట్టు
జీవన సంగ్రామంలో ఓడిపోయి
బీడువారిన నా జీవితంలో
చిగురాశలు పూయిస్తావేమోనని
నీ ఆగమనం కోసం ఈ ఎదురుచూపులు...

నా కష్టాలు, కన్నీళ్ల గాథను
ఎదురుచూపుల అంతులేని వ్యధను
ఏడాది నుండి ఉన్న ఎడబాటును
నీ లోటుతో కల్గిన తడబాటును
ఎగాదిగా గాంచి
దిగాలుగా ఉన్న నా మనసులో
సంతోషాలను పూయించడానికి
వస్తున్న నా ప్రియ సఖి కోసమే ఈ నిరీక్షణ...

# మౌనం

**ఉప్పల పద్మ**
సాహితీ కౌముది అధ్యక్షురాలు, మిర్యాలగూడ

మది గీచిన భావచిత్రం...మౌనం
మాటలు చాలని భాషకు మూగ గళం...మౌనం
మొహమాటానికి హృది చేసిన సంతకం...
మౌనం
ప్రతిఘటించలేని స్పందనలకు
సంకేతం...మౌనం
అర్ధాంగీకారపు ఆనవాళ్లకు సాక్ష్యం...మౌనం
ఊటలా ఉబికివచ్చే ఉపద్రవాలకు
ఊరట...మౌనం
ప్రశ్నించలేని నిస్సహాయతకు
పరిష్కారం...మౌనం
పరిపరి విధాల యోచించే మనసుకు
సద్రూపం...మౌనం
మనసుకైన గాయాలకు మంచి
లేపనం...మౌనం
మనిషికి మౌనం శ్రేయస్కరం
శృతి మించితేనే శాపం
ఎట్టకేలకు...
మనిషికి మౌనం ఒక వరం!

# నిజమైన పండగ

- తమిరిశ జానకి
హైదరాబాద్

ఆకులు రాలిన చెట్టు అగుపడుతోంది అందంగానే
చేసిన చాకచక్యపు చెక్కబొమ్మల్లే!
చిరునవ్వుల చిగుళ్లు దానికి తొడిగి
ఆకుపచ్చనివర్ణపు రేఖాచిత్రం గీసేందుకు
కదులుతూ వస్తుంది కాలం ముందుకు!
అయినా మానుకీ ఉన్నాయి కష్టాలు
కొడవళ్ల గొడ్డళ్ళ దెబ్బలబారిపడుతూనే ఉంటుంది
పడి లేస్తూనే ఉంటుంది
పళ్ళూ పూలూ అందిస్తుంది
మానవత కాస్త అలవరచుకోమని మానవులకి
పాఠం చెపుతూనే ఉంటుంది!
పూచిన వేప పూత చిరుచేదులతో
తియ్య తియ్యని చెరుకు గడలతో
వచ్చేశాయి ఉగాది సౌరభాలు
ఉదయాన్నే ఉగాది పచ్చడి తినడంతో
అయిపోతుందా ఉగాది
గతవర్షపు తప్పిదాలు సరిదిద్దుకునే యోచన లేదా
అవినీతిని కడిగే పని సంకల్పించు నువ్వు
సంకల్పబలమే తీసుకుపోతుంది నిన్ను ముందుకు
లేకుంటే ఆరంభింపరు నీచ మానవులన్న రీతిలో
చలనమే కానరాదు జీవితాన
ఎన్నిలేవు సమాజాన నువ్వు సరిచేద్దా మనుకుంటే
కూడగట్టుకో నీ తోటివాళ్ళని
అయిదు వేళ్ళూ కలిస్తే అవుతుంది పిడికిలి
ఆలస్యమెందుకు తొలి అడుగు వేయి
అవుతుంది ఈఉగాది నీకు నిజమైన పండగ!

# వసంతోత్సవం

- బుస్సా రూపారాణి

చిలిపి సోయగాల
చెలి సిగ్గు పలికె
ఎఱ్ఱబుగ్గలే సొగసులాయె

నీలి ఊసుల
రాసక్రీడలో సుమాళించె
నీలాంబరం పందిరాయె

పసిడి అందాల
మోము ప్రకాశించె
పసుపు పచ్చని మేను పరవశమాయె

రోజా పువ్వుల
మృదుత్వం చిన్నబోయె
గులాబీ రంగులో పెదవి సున్నితమాయె

కోటి తారల
మిణుకులు నిస్తేజమాయె
నల్లని నేరేడు పండుకన్నులు నిగనిగలాడె

మధువన పురం జనాల
మైమరపులు రసనమాయె
రాధాకృష్ణల రక్తి రంగులలో రంగరంగ
వైభవమాయె

# సంబరాల ఉగాది

- అనురాధ చంద్రశేఖర్

చైత్రమాసరథంపై వచ్చింది శ్రీ వికారినామ
సంవత్సరం
అందరి ముగ్గిళ్ళలో విరిసింది ఆనందోత్సవం

కాలచక్ర గమనాన్ని తెలిపేది ఉగాది
ఆరు ఋతువులను శాసించేది ఉగాది

వెలుగు నీడలను సరితూచేది ఉగాది
షడ్రుచుల మేళవింపు ఉగాది

కొత్త కోడళ్ళతో రంగులద్దుకున్న లోగిళ్ళు
అల్లుళ్ళ రాకతో మురిసిన పొదరిల్లు

చెఱకు రసం తీపిని ఇనుమడించే పసిపిల్లల
నవ్వులు
వేప పువ్వుల చెడును మరిపించే మామిడి
పిందెలు

అన్ని రుచుల కలగలుపు ఉగాది పచ్చడి
జీవన గమన సారమే ఈ ఉగాది పచ్చడి

ఉగాది అన్ని పండుగలకు ఆది
ఉగాది నవయుగానికి నాంది.

# అస్తమించని అరుణోదయం కవిత్వం

- ఆదోని అభిరామ్
ఆదోని

సృష్టిలో విజ్ఞాన దృష్టిని
సృజించే
వసంత రేణువుల స్పర్శా బిందువు అక్షరం

చరిత్రను తనలో దాచుకొని
దేవునిలా పూజించే
గర్భాలయం పదం

ఆకలికేకల ఆగడాలను
అవినీతి కెరటాల వికృతాలను
హత్యచేసి
వివేక సూర్యోదయమై
బాల వాక్కుల కొండల్లో నిత్యం ఉదయించే
విశ్వశాంతి పరిమళ సూర్యకాంతి సమూహం
వాక్యం

కష్టనష్టాల కడలిలో
అవిర్భవించే అనుభూతి అనుభవాల
స్వాతిముత్యం కవిత్వం

అంతులేని కవిత్వ గర్భంలో
పురుపోసుకుంటున్నదే
ఈ సృష్టిపంజరం

# గోదావరి తల్లి

- చవాన్ వెంకటేష్

గోదారి గోదారి
మన పాలకడలి కదా
గోదారి
మా ఊరి గోదారి
రంగు రంగుల రహదారి..

మేతంగా మనసుల్లో నిండిన గోదారి
తడిపింది తడిపింది
మన పంటలనే ముద్దాడి
రేపింది ఆశలనే ఓ పరుగుల జలధారి
నడిచొచ్చిన నెలవంకలనే
నవ్వించిన గోదారి
చుట్టు చుక్కలనే చూపింది
నా గోదావరి
పడుచువాలు చూపులను
పలుకరించి పువ్వులనే పంచే
ప్రకృతి గోదావరి..

గోదారి గోదారి
మన పాలకడలి కదా గోదారి
మా ఊరి గోదారి
రంగు రంగుల రహదారి..

ఎన్నెన్నో మలుపులతో మదిని దోచే మనసున్న
మా ఊరి మహారాణి
మా గోదావరి..
ఆ పాపికొండలలో పాలధారుల ప్రవహించుతూ
పుష్కరముల పుణ్యఫలమునే పంచును
నా గోదావరి
కృషి చేసే మనుజులకే
కాసులను కురిపించి సిరిసిరి మువ్వల
పరుగులతో వొడికి చేరును
నా గోదావరి
ఆశలనే ఆయువుచేసి
అమ్మచేతి ముద్దగా మలిచి అమృతమునే పంచును
నా గోదావరి మన గోదావరి...

# ప్రియ భారతం!

- శారద కాశీవఝుల

భారతీయ విమానాశ్రయంలోంచి బయటకి
వస్తూంటే కమ్మని మట్టివాసన..
పదేళ్ళ తర్వాత మాతృదేశంలో అడుగు పెడితే
అదే తన్మయ భావన..

నడిరేయి ఆగమనాన్ని నడిరోడ్డు మీద
స్వాగతించిన గోవులూ,
తమ నిద్రని త్యాగంచేసి మరీ మొరిగి మేల్కొలిపే
కుక్కలూ,
బోరు కొట్టక భోరుమన్న పోర్టర్ల వ్యధలూ, జోరు
తగ్గని కార్ల రొదలూ,
దారంతా డ్రైవర్ వింత కథలూ, కొత్తరక్తం
కోసం దోమల సోదలూ - అన్నీ అందమే!

రాక కోసం ఆశగా ఎదురుతెన్నులు చూస్తున్న
ముంగిలీ,
చిరునవ్వులతో బాహువులు దాచి రమ్మన్న
ద్వారాలూ
మాతృభాషలో కుశలాలు అడిగిన కోయిల
రాగాలూ,
ఘుమ్మనే పెరటి సన్నజాజి పందిరి పరిమళాలూ
- అంతటా ఆహ్వానమే!

తెల్లారగానే సందులోని పిల్లలంతా వచ్చి
హక్కుతో అమెరికా చాక్లెట్లు పట్టుకుపోయారు...
ఉగ్గబట్టుకున్న యక్ష ప్రశ్నలతో అమ్మలక్కలంతా
బిలబిలమని ఇంటిమీద దాడిచేశారు...
రెండురోజుల్లో నా చర్మం సంగతి దుమ్ము
చూస్కుంటుందిలే
అని తృప్తిగా సర్దిచెప్పుకున్నారు...
"ఏవైనా, పిల్ల పరాయిదేశంలో చిక్కిపోయింద"ని
చివరకి కంటతడి పెట్టుకున్నారు - అవన్నీ
ఆపేక్షలే!

దిక్కు తెలియని కుర్రకారంతా పోయే
నిరుపయోగ ఖండమే అమెరికా అని
నిశ్చయించేసి,
అక్కడి మనుషులకి విడ్డూరమూ పోగాలమూ
కాబట్టి
మనదేశమే మెరుగని తీర్మానించేసి,
పరుగుల పాలు తప్ప నిలబడి నీళ్ళు తాగక
మళ్ళీ మన దగ్గిరకే ప్రేమలకి వస్తారని
ఈసడించేసి,
ఆరా కోసం అరమైలు నడిచొచ్చిన బామ్మగారు
తనే జవాబులు తేల్చేసింది- అదీ వాత్సల్యమే!

"ఆ దేశంలో మీ చెత్త మీరే ఎత్తుకోవాలంట
కదమ్మా?"
అని ఆశ్చర్యపోయే పాకీపని నర్సన్నా..
తమ పనులు ఆపేసి, బీడీలూదుతూ మోడీ
గురించి
చాడీలు చెప్పేసుకుంటున్న కూలీలూ,
రెండు రోజులు కొనగానే సందు మలుపులో
మూర మల్లెలతో
మూడో రోజు ఆశగా నిల్చునే పూలమ్మీ,
దగ్గితే, మురికి చేతులతో ఎంగిలి నీళ్ళు
ఆరాటంగా అందించే అంగడివాళ్ళూ -అంతా
ఆదరణే!

పావుశేరు పల్లీలు అమ్మడానికి,
ఎండకి తెగించి రోజంతాకూచున్న ముసలి
అవ్వలూ -

ప్రపంచంలో అందరి బాధ్యతల కన్నా
తనదే పెద్ద సమస్య అని నమ్మే రిక్షావాడూ –
పక్కవాడి భక్తి నుంచి దేవుడిని
తన భక్తి వైపు తిప్పడానికి పాట్లు పడుతున్న
భక్తులూ –
చీదరించుకుంటున్నా తుడిచేసుకుని,
పాపాలు కడుక్కోమని రివర్స్ బ్లాక్మెయిల్ చేసే
బిచ్చగాళ్ళూ – అంతా అమాయకులే!

సవ్యసాచి గాండీవంలాంటి 'గేర్'తో
దూసుకుపోయే
ఆటో అభిమానులూ, బైక్ భస్మాసురులూ,
కొత్త కారైనా, చెత్త సైకిలైనా గుద్దితే
అరుచుకుని, దులుపుకుని సర్దుకునిపోయే
సామ్యవాదులూ,
ఏ ఇద్దరు మాట్లాడుకుంటున్నా
మధ్యలో జొరబడి తీర్మానాలు చెప్పేసే పక్కింటి
వాళ్ళూ,
మూడు బస్సులు మారి, మూడు గంటలు
ప్రయాణించి
వచ్చిన మరదళ్ళూ, చెల్లెళ్ళూ – అందరూ
అపురూపమే!

అత్యాశ లేని పళ్ళ దుకాణదారులూ,
ఆరాటపడి చల్లబరిచే హిమక్రీము వాళ్ళూ,
బేరం లేకపోయినా చీకు లేక
కులాసాగా పడుకునే కొబ్బరిబొండం వాళ్ళూ ,
బకాసుర బాబాయి దీవెనతో
కొదవలేని చిరుతిండి బండ్ల
చిన్న యజమానులూ,
ఇంటా బయటా 'తర తమ భేదాల్లేని'
పలకరింపుకి
కొదవ ఇవ్వని ఊసుగాళ్ళూ – అంతా
మురిపెమే!

మల్లెలూ, మావిడి పళ్ళూ, మమతలూ,
మాటలూ అన్నీ ఆనందమే!
మనుషులూ, మొక్కలూ, మాటకారులూ,
మూగజీవులూ అన్నిటితో బంధమే!
అవే గోవులూ, ఆకులూ, పువ్వులూ, గాలులూ
విమానాశ్రయానికి తిరిగి వెళ్తుంటే మాట్లాడవేం?
వచ్చినప్పుడు సంతోషంతో కన్నీళ్ళు,
వెళ్ళిపోయేటప్పుడు బాధతోనూ కన్నీళ్ళే...కానీ
జ్ఞాపకాలు కోకొల్లలు!

# శ్రీరాముడు

- వేణు ఆసూరి

ఎవరయ్యా రాముడు?
ఎందుకాయె దేవుడు?

సత్యానికి, ధర్మానికి
అధికారం, ఐశ్వర్యం
సరి రావని ప్రకటించిన
వినయశీలి రాముడయా!

మనసునిండ ప్రేమతో
మధురమైన మాటలతో
కన్న తల్లితండ్రులనే
మరపించే పాలనయా

ఎదురులేని వీరుడైన
పరుల సొమ్ము కోరడట
శరణన్నది శత్రువైన
కరుణ బ్రోచు వేలుపట

ఎదుటనున్న, దూరమైన
పడతి సీత ప్రాణమట
ప్రజల మాట తలదాల్చి
ప్రాణమైన వదలునట

రాచరికపు యుగంలో
ప్రజల వాక్కు శాసనమట
అడుగడుగున త్యాగాలతో
ప్రభువే తలవంచెనట

అతడయ్యా రాముడు
అందుకాయె దేవుడు!


నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

కొన్నేళ్ళు - — [illegible]
[illegible]
[illegible] కొమ్మని
ఆ కొమ్మ మీదే ఉండమంటాను!

[illegible]
[illegible] ఆ పంచనే
పడుండమంటాను!

[illegible]
[illegible] సంఘం చేసి
[illegible]
[illegible] మంటాను!

కాబోయే ఉగాదున్ని
స్మృతి చేసుకుంటూ
అల్లనల్లన [illegible] కోయిల
గానాన్ని వాయిదా పడమంటాను!

[illegible] గాయాలనోర్చుకుంటూ
నేల రాలుతున్న పిచ్చిపిచ్చుకన్ని
వెచ్చని నా నెచ్చెలులవమంటాను!



# బిడ్డను కళ్ళల్లో పెట్టుకొనే తల్లిలాంటిది కవిత్వం

- డా. రావి రంగారావు
గుంటూరు

కవిత్వం కిరీటమంటావో
కాలి చెప్పంటావో అభ్యంతరం లేదు
ప్రజలకు పనికొస్తుంటే...

కవిత్వం పంటకు ముందు పువ్వును,
వంటకు ముందు నిప్పును - ఇబ్బంది లేదు
మనుషుల కందుబాటులో ఉంటే...

కవిత్వం కొండంటావా
గిరిజనులకు బతుకిస్తుంటే...
కవిత్వం కుండంటావా
మంచి నీటి స్వరంతో వేసవిని మర్యాదగా
సాగనంపుతుంటే...

తిన్నగా ఉండే ఐరన్ రాడ్ కవిత్వం,
నల్లగా నడిచే, ఎర్రగా అరిచే క్రూరజంతువుల్ని
కొట్టటానికి...
నున్నని సిమెంట్ రోడ్ కవిత్వం
నిరపాయంగా నిర్మల జీవన సీమల్ని
చేరుస్తుంటే...

కోకిల మీద రాస్తావో, కాకి మీద రాస్తావో, కాకి
ఈక మీద రాస్తావో
పీక మీద రాస్తావో, పాలపీక మీద రాస్తావో
పూలరేకు మీద రాస్తావో, ఇనప రేకుమీద
రాస్తావో

దేని మీదైనా కవిత్వం రాయి -
కాని అది ప్రపంచానికి ఒక వెలుతురు కిరణం
కావాలి,
మురికి మీద రణం కావాలి, ఒక తిరుగులేని
బాణం కావాలి...

ప్రపంచం పసిబిడ్డను
కళ్ళల్లో పెట్టుకొనే తల్లిలాంటిది కవిత్వం,
బిడ్డ గుక్కపట్టి ఏడుస్తుంటే
వ్యామోహంతో ఇష్ట సఖుడి కోసం తిరిగేది
కవిత్వం కాదు...

కొనుక్కున్న జయజయ ధ్వానాలతో - పోటీలలో
అదేపనిగా పాల్గొంటూ
ఆర్భాటంగా నామినేషనుకు వెళ్తున్న - అభ్యర్థి
లాంటిది కాదు కవిత్వం,
ఎవరూ పట్టించుకోని ఏకాంతంలో ఉండి - పోటీ
చేయటమంటే తెలియని
మారుమూలకు నెట్టబడిన - విలువల చర్మం
ధరించిన మనిషిలాంటిది కవిత్వం...
మనమే వెళ్ళి మన కవిత్వాన్ని పిలిచి తెచ్చుకోవాలి,
మన హితం కోసం మనమే పోరాడి
మన కవిత్వం గెలుపు నిలుపుకోవాలి.

# భరతమాత నీకు వందనములు

- సాగర్ల సత్తయ్య
నల్లగొండ

దేశమాత కీర్తి దేదీప్యమానమై
వెలుగవలయును మన విశ్వమంత
శాంతి సుధలు పంచు చక్కని దేశమా!
భక్తి తోడ కొలుతు భారతాంబ

భిన్న మతములున్న భేదమే కనరాని
సహన శీలమున్న సాధుభూమి
సమత మమత మరియు సౌభ్రాతృ భావనల్
వెల్లి విరియునట్టి తల్లి నతులు

కులములెన్నియున్న కలహముల్ లేనట్టి
ఐక్యమత్యమున్న అమృతభూమి
వేదములకు నెలవు నా దేశమాతకు
ప్రణతులిడుదు నేను భక్తి తోడ

గంగ యమున సింధు మంగళప్రదమైన
పుణ్య నదులు పారు పుడమి నాది
తరులు గిరులు ఝరులు తనువంతనలరారు
భాగ్యవంతురాలు భరతమాత

సంప్రదాయములకు సంస్కృతికి నెలవు
వీర సుతుల గన్న శూరమాత
అవని దేశములకు ఆదర్శమై నిల్చు
భరతమాత నీకు వందనములు

# తెలుగు పల్లెలు

శ్రీకళ్యాణి శాఖమూరి

పసిడి పంటల వీచు పైర గాలుల సడి
ఆలమందల మెడల చిందు మువ్వల రవళి
చిలుకపలుకుల తోడి చిట్టి పాపల సందడి
కలికిచిలకల కొలికి కాలి అందెల యుగళి
భక్తిశ్రద్ధల మ్రోగు గుడిగంటల జావళి
మట్టి ప్రమిదెల వెలుగు నిత్య దీపావళి
మేటి ముగ్గులు దింపె భువికి తారావళి
పల్లె పల్లెల నుండు నిత్యమీ ఘటనావళి


ఇది 'ఇంటిదొంగ' పనే!


పరిపాలనం నిర్వహిస్తే-
ప్రతి ఇంటికీ కరెంట్
సప్లైలు చేస్తా...
వీడి మాటలు
నమ్మొద్దు!


ఇదిగో... నా హోమ్ వర్క్ చేసే పుస్తకం కూడా
తీసి కెళ్ళిపో...


ఆర్థిక మంత్రి
మీరే కదు నాన్నా!!
రూపాయి విలువ
పది పైసలకు పడి
పోయిందన్నది!!


మీ కథ ఏ నెలలో
పంపించారన్నారు!
ఎడిటర్
జనవరి
జూన్


మీ నాన్న రైల్వేలో జాబ్ చేస్తుంటే మటుకు.. రోజూ
స్కూలుకు మధ్యాహ్నం లేటుగా వస్తే ఎలాగ్రా..?
3వ తరగతి


ఇది తాకట్టుపెట్టుకొని
ఓ పదివేలు అప్పివ్వండి!
చంద్ర


వెధవ సిటీ... ఎక్కడా వేపాకు దొరికి చావలేదు...
అందుకే చేదు కోసం ఉగాది పచ్చడిలా
కుంకుడుకాయ రసం వేశా....




ఈవారం నా రాశిఫలం
ఎలా వుండబోతుందో చెప్పండి




భగవద్గీత ప్రస్తుతం వివాద కాకుండా
అలా గాలిలో చేయిపెట్టించి
ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారే?
క్రితం సారి వచ్చినప్పుడు
ఆ భగవద్గీతను కూడా
కొట్టేసాట్టమది!!








ETKO
JHGL
ETMDR
POIFZKP






సార్! వాళ్లు పెట్టిన ఉగాది
తింటేనే ఓటు వేస్తారట


థ్యాంక్స్ బాబూ... ఎన్ని దేవుళ్లకు తపస్సు చేసినా... ఈ మంచులోంచి బయటపడలేక పోయాను...!
S.BABU




చివరి ప్రశ్న! అన్ని దానాల్లోకీ ఏ దానం గొప్పదోయ్?
నిస్సందేహంగా.. ఉద్యోగ దానమే సార్!
ఇంటర్వ్యూ
రవి




వాడు నేను కాదు!
వాడు పక్కింటి వాడు!!




మరి కొద్ది క్షణాల్లో చిత్ర హింసలు సీరియల్
ప్రసారమవుతుంది!!...

# సెల్లోపాఖ్యానం

- తమిరిశ జానకి
హైదరాబాద్

డ్రయివింగ్‌లో ఉన్నాడు సుందరం. జేబులో సెల్ మోగుతోంది. కాదు కాదు పాడుతోంది నిను వీడని నీడను నేనే అంటూ. కాస్తంత దూరంలోనే ట్రాఫిక్ పోలీస్ కనిపించాడు. జేబుదాకా వెళ్ళిన చెయ్యి వెనక్కి వచ్చేసింది. ఆ ట్రాఫిక్ పోలీస్ అక్కడ లేకపోతే బండి నడుపుతూ మాట్లాడదామనే...... బండి పక్కకి పెట్టే ఉద్దేశం లేదు. అంత రద్దీలో పక్కకి పెట్టి కూచుంటే ఇల్లు ఎప్పటికి చేరాలి..... పైగా సి. సి. కెమేరాలు వచ్చి పడ్డాయిగా ప్రాణానికి అన్న కోపం. తన ప్రాణానికే ముప్పు అన్న ఆలోచన లేదు. ఇల్లు చేరాక ఇంటి గుమ్మంలో స్కూటర్ స్టాండ్‌వేసి వెంటనే సెల్ తీశాడు. స్నేహితుడు ప్రసాద్ కాల్. అతనితో మాట్లాడుతూనే ఇంటి తలుపు కొట్టాడు. నీకసలు పిచ్చెక్కింది అంటూ పకపకా నవ్వుతూ తలుపు తీసిన భార్య కవిత మాటలకి జుట్టు పీక్కునేవాడే గానీ చెవికీ భుజానికీ మధ్య కనిపించింది సెల్. ఆమెగారి ఆత్మీయ స్నేహితురాలని అర్థమయింది. ప్రసాద్ చెప్తున్నది వింటూ అతనికేదో కనపడుతుందన్నట్టుగా తల కూడా ఊపుతూ లోపలికి వచ్చి సోఫాలో కూచున్నాడు. స్నేహితురాలితో కబుర్లు చెప్తూనే కాఫీ కలిపే పనిలో పడింది కవిత. కాఫీ కలిపే చిన్న గిన్నె పెరట్లో రవణమ్మ తోముతున్న సంగతి గుర్తొచ్చి పెరట్లోకి నడిచింది.

చంపుతా....వచ్చావంటే....రవణమ్మ గట్టిగా అరవడంతో హడిలిపోయి గడప అవతల వేసిన కాలు వెనక్కి తీసుకుంది. తీరా చూస్తే మెడకీ భుజానికీ మధ్య సెల్ ఇరికించుకుని ఎవరితోనో మాట్లాడుతోంది. అవతలివాళ్ళ మీద కోపాన్ని గిన్నెల మీద చూపిస్తూ, బరబరా తోమేస్తోంది విసురుగా. స్నేహితురాలితో మాటలు కొన సాగిస్తూనే కాఫీ గిన్నెని చూపిస్తూ తోవడం అయిందా, తీసుకోవచ్చా అన్నట్టుగా సైగ చేసింది కవిత. తీసుకోమన్నట్టుగా చేత్తో తనుకూడా సైగ చేసింది రవణమ్మ.

అసలీ ఆడవాళ్ళకి మొగుడి సంగతి పట్టదు ప్రసాద్. అటు టీ.వీ. సీరియల్స్ చూస్తూ కూచోడమో లేకపోతే ఎవరితోనో ఒకళ్ళతో సెల్‌లో సొల్లు కబుర్లు గంటల తరబడి చెప్పుకోడమో అంతే. మనతో మాట్లాడే పనిలేదు. కాలిమీద కాలేసుకుని కూచుని కాఫీ కోసం ఎదురు చూస్తూ గట్టిగా నవ్వాడు తన మాటలకి తనే మురిసిపోతూ.

ఇక్కడ మా ఇంట్లోనూ అదే పరిస్థితి సుందరం. ఏవిటో ఈ ఆడవాళ్ళు. వీళ్ళని ఆ బ్రహ్మదేవుడు కూడా మార్చలేడనుకో. నిట్టూర్చాడు ప్రసాద్.

సరిగ్గా అవే రకం ఆరోపణలు సాగుతున్నాయి స్నేహితురాళ్ళిద్దరి మధ్యనా. వేడి వేడి కాఫీ కప్పుల్లో పోస్తూ, అంతకంటే వేడిగా వాడిగా మాటలధార కురిపిస్తోంది కవిత స్నేహితురాలి సెల్లో.

పొద్దున్నించీ ఆఫీసే కదా....... ఇంటి కొచ్చాకైనా కాస్త కబుర్లు చెప్తారా అంటే అబ్బే అలాంటిదేమీ లేదు. ఆ సెల్ చెవికి అంటించుకుని స్నేహితులతో పిచ్చాపాటీకి అంతే ఉండదు. రోలొచ్చి మద్దెలతో మొరపెట్టుకున్నట్టే ఉంది

మనిద్దరి సంగతి. నిట్టూర్చింది అటుపక్క సెల్. మరో పెద్ద దీర్ఘ నిశ్వాసం తీసింది ఈ సెల్ కూడా.

అదేవిటోనే పొద్దున్న లేచింది మొదలు అన్నేసి సీరియల్సు చూస్తానా ఏ ఒక్క దాంట్లోనూ మన ఆడవాళ్ళు అనుభవిస్తున్న ఈ మానసిక చిత్రహింస గురించి చూపించరేమిటి....మానసిక చిత్రహింసా.... మరీపెద్దమాట ఉపయోగించా వేమోనే....

చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టమన్నారు కదా...అందుకని...ఇదుగో ఈ కాఫీ ఆయన గారికిచ్చేస్తే ఓ పనై పోతుంది బాబూ....మీ తమ్ముడి పెళ్లి విశేషాలు చెప్పు. వింటూ కూర తరుక్కుంటాను. తర్వాత మా చెల్లెలి పెళ్లి విశేషాలు నేను చెప్తాను. ఇటు నా వంటా, అటు నీ వంటా కూడా అయిపోతుంది.

నిజమే. ఈ మధ్య మా అమ్మ వచ్చి నాలుగు రోజులుండి వెళ్ళింది. అప్పుడొకటే గోల ఎప్పుడు చూసినా ఆ సెల్లో గంటలతరబడి కబుర్లేమిటే చేసే వంట మీద కాస్త దృష్టి పెట్టు, ఉప్పేస్తే కారం వెయ్యట్లేదు కారం వేస్తే ఉప్పెయ్యట్లేదు..... అల్లుడుగారెలా తింటున్నారో పాపం. మంచివాడు కాబట్టి సరిపోయింది అంది.

ఔను కదా ఈ విషయంలో మంచివాడే అయితే....అవతల్నించి నవ్వు. మంచా గడమంచా అన్నం తింటున్నంత సేపూ ఆయన ఎవరితోనో ఒకళ్ళతో సెల్లో కహానీలు చెప్తూనే ఉంటారు కదా....ఏం తింటున్నారో కూడా పట్టించుకోని మనిషికి ఇంక రుచులు కూడానా సంబడం.

కాఫీ తాగడం అయిపోయింది గానీ కబుర్లు అవుతాయా ఇద్దరికిద్దరూ అఖండులే మరి అందులో. ప్రసాద్ ఇంకో కాల్ వస్తోంది. అది మాట్లాడటం అయ్యాక మళ్ళీ నీకు చేస్తాను అంటూ ఆ కొత్త నెంబరు కలిపాడు. మావయ్య రామన్న పంతులు ఇంటి నెంబరు అది. ఆయన పరిస్థితి సీరియస్‌గా ఉందని ఆయన కోరిక మీద హాస్పిటల్ నించి ఇంటికి తీసుకొచ్చెయ్యాల్సి వచ్చిందని వాళ్ళబ్బాయి చెప్పడంతో ఆ విషయం స్నేహితుడితో చెప్పేసి వాడు చెప్తున్నదేదో వింటూ వంటింటివైపు నడిచాడు. ఏవిటన్నట్టుగా చూసింది కవిత. మా రామన్నపంతులు మావయ్య అంటూ చెయ్యి పైకి చూపించాడు. పోయారా అన్నట్టుగా తనూ సైగ చేసింది కవిత. గబగబా తల అడ్డంగా ఊపాడు. సీరియస్ అన్నాడు. ఏవిట్రా సీరియస్ నేనేదో వేళాకోళంగా చెప్తుంటే" చిన్నబుచ్చు కున్నాడు ప్రసాద్. "అబ్బా నీతో కాదురా" అంటూ సర్ది చెప్పాడు సుందరం.

ఓ రెండు గంటలు బస్సు ప్రయాణం చేసి రామన్నపంతులు మావయ్య ఊరు చేరుకున్నాడు సుందరం. వాళ్ళింట్లో ముందుగదిలో అడుగు పెట్టాడు. మావయ్య ముగ్గురు కొడుకులూ అక్కడే కూచునిఉన్నారు. ఇద్దరు ఆస్తిపాస్తుల గురించి చర్చించుకుంటూ కాగితాల మీద లెక్కలు రాసుకుంటున్నారు. ఒకడు ఆ పక్కగా నిలబడి సెల్లో గట్టిగా ధూంధాంలాడుతున్నాడు ఎవరిమీదో. ఇంతలో మోగనే మోగింది సుందరం జేబులో నిను వీడని నీడను నేనే అని పాడుతూ సెల్. తీసి చూశాడు. యముడిలాంటి ఆఫీసర్ గారి నెంబరది. రేపు ఆఫీస్ లో ఇన్స్పెక్షన్ ఉంది ఆ విషయం గుర్తుకి రాగానే అప్రమత్తుడై హలో సార్ అన్నాడు నెంబరుకి

స్పందన ఇస్తూ. లెక్కలు రాస్తున్న ఇద్దరూ డబ్బు లెక్కల్లో తలమునకలై ఉండి తలెందుకెత్తుతారు. సెల్లో ధూంధాంలాడుతున్నవాడు దానికి తగ్గట్టు తల కదుపుతున్నాడు కాబట్టి ఆ కదలికల్లో ఓసారి సుందరం కనిపించాడు కంటిముందు. సుందరాన్ని గుర్తుపట్టి చేత్తో లోపలి గదివైపు చూపించాడు. బహుశా ఆ గదిలోకెళ్ళి ఫోన్ మాటాడుకో మంటున్నాడేమో ఇక్కడ తనో పక్క అరిచి మాటాడుతున్నాడు కదా అని.....అలా అర్థం చేసుకున్నాడు సుందరం. వెంటనే ఆఫీసర్‌తో మాటాడుతూనే ఆ గదిలోకెళ్ళాడు. పచ్చివెలక్కాయ గొంతుకి అడ్డ పడినట్టయింది. అక్కడ మంచమ్మీద మావయ్య......పక్కన కుర్చీలో పెద్దకూతురు పూర్ణమ్మ... ఆవిడ చేతిలో కర్ణాభరణం. సుందరాన్ని చూస్తూనే అక్కడే ఉన్న మరో కుర్చీ చూపించింది రెండోచేత్తో కూచోమన్నట్టుగా. ఇబ్బందిగా చూస్తూనే టక్కున కూచున్నాడు. ఆఫీసర్ గారిచేత తిట్లు తప్పవన్న దిగులు మొహాన్ని ఎలాగో ఆవరించేసే ఉంటుంది కాబట్టి ఇక్కడి ఈ పరిస్థితికి ఈమొహం సరిపోతుందని కుదుటపడ్డాడు కాస్త. ఇదుగో నాన్నోయ్ అమెరికా నించి నీ మనవరాలు నిన్ను పలకరిస్తుందిట అంటూ స్పీకర్ ఆన్ చేసి సెల్ ఆయన చెవి దగ్గిర పెట్టి తను ఓ చేత్తో పట్టుకుంది పూర్ణమ్మ. ఆయనకి అర్థం అవుతోందో లేదో ఆ దేవుడికి తెలియాలి. అలా ధారావాహికలాగా మాటాడుతూనే ఉంది ఆ మనవరాలు. అంతూదరీ కనపడలేదు సుందరానికి. మావయ్య వంక చూస్తూ రకరకాల హావభావాలతో తను తిప్పగలిగినంతగా కళ్ళూ మొహం చేతులూ తిప్పాడు. ఆయన తిప్పాలేదు.....తిప్పే పరిస్థితిలోనూ లేడు చెవి దగ్గిర సెల్లయ్యె. ఇంతలో వంటావిడ కాబోలు మంచినీళ్ళు పట్టుకొచ్చి ఇచ్చింది. ఆ వెంటనే రెండు కప్పులు టీ కూడా పట్టుకొచ్చింది. టీ తాగుతున్నంతసేపూ ఉస్సురుస్సురంటూ అపసోపాలు పడిపోతున్న పూర్ణమ్మని పలకరించే సాహసం చెయ్యలేక పోయాడు సుందరం. తాగడం పూర్తయ్యేసరికి నిను వీడని నీడను నేనే పాట జేబులో. తప్పదు....వెంటనే బయల్దేరి వెళ్ళాలి....ఎంత పొద్దుపోయినా ముందు ఆఫీసర్ గారింటికెళ్ళి కలవాలి. లేకపోతే రేపు ఆయనగారి కోపానికి గురి కావల్సిందే..... కంగారు పడుతూ లేచాడు సుందరం. ఆ మనవరాలు ఏం కబుర్లు చెప్తోందో ఆ తాతగారికి ఏమి అర్థ మవుతోందో తెలియదు. కానీ తన పరిస్థితి తనకి బాగానే తెలుస్తోంది. మెల్లిగా గదిలోంచి ఇవతల పడ్డాడు. ఆ తర్వాత ముందు గదిలోకొచ్చి ముగ్గురు అన్నదమ్ముల చెవుల్లోనూ సెల్ ఉండడంతో చెయ్యి ఊపి బయట పడ్డాడు.

# సై-బురుక్షేత్ర గీత

- రావు తల్లాప్రగడ

సైబురుగీత భగవద్గీత యొక్క సమగ్ర సారాంశము. భక్తుడైన దుర్జునునకు ఒనర్చిన ఉపదేశమే ఈ సైబురు గీతోపదేశము. సైబురు యుద్ధము జరుగరాదని సర్వ విధముల భగవానుడు ప్రయత్నించెను. కాని ఆ మహానుభావుని ప్రయత్నములు వ్యర్థములాయెను. అటు పిమ్మట శ్రీకృష్ణుడు దుర్జునునకు సారథియై నిలిచెను. ఎవరు ఎవరి సైన్యమో తెలియని పలు సైన్యముల మధ్య జరుగుతున్న యుద్ధములో గల పెద్దలను, గురువులను, మేనమామలను, సోదరులను, మనుమలను, మిత్రులను చూచి, హృదయము ద్రవించి, నిస్పృహకు లోనయి దుర్జునుడు ఇటుల అనియెను:

**దుర్జన ఉవాచ:**

ఆ.వె.॥ లేదు విజయకాంక్ష, లేదరాచకకాంక్ష
లేదు రాజ్యకాంక్ష, లేదు కృష్ణ!
లేదుమోదమిందు, రోదనాపథమందు!
చేదుపోరులింక చేయలేను!

వచనం: కృష్ణా! ఈ ఆధునిక యుగమందున కంప్యూటరులో వచ్చిన ప్రతి ఈమెయిలునీ అందరికీ ఫారువార్డు చేసుకోనుటయే ఒక పనియై పోవుచున్నది. కొన్ని చదివి బాగున్నాయని పంపినచో, మరికొన్నిటిని చదవడానికి టైములేక బాగానే వుండివుంటాయని ఊహించుకిని ఫార్వార్డు చేయుచుంటిమి. దీనినే కొందరు స్పాము అనుచున్నారు. కృష్ణా, ఇటువంటి స్పామును నేను సంధించ జాలక, ఈ సై-బురుక్షేత్ర యుద్ధము నుండీ విరమించదలచుకున్నాను. కనుక నా లాపుటాపునూ, టాబ్లెట్టునూ, స్మార్టు ఫోనునూ అన్నీ క్రింద పడవేయుచుంటిని.

**కృష్ణ ఉవాచ:**

కం.॥ పుట్టిన వానికి తప్పదు
గిట్టుట, తప్పదు కఠినమె క్షేత్రజ్ఞునికిన్!
ముట్టిన మెయిలుని వెంటనె
నెట్టుము, మోహము విడుచుట నెరుగుము
పార్థా!

వచనం: పుట్టినవానికి మరణము ఎట్లు తప్పదో, వచ్చిన ఈమెయిలుకు పోకయూ తప్పదు. అందుచేత పార్థా, మోహమును వీడి వెంటనే ఫార్వార్డు చేయుము.

**దుర్జన ఉవాచ:**

ఆ.వె.॥ బంధుమిత్రుల పరివారమందు కలదు!
గురువుపూజ్యుడనొక గొడవ కలదు!
వద్దనన్నకూడ వారికే ఈమేలు
ఫారువార్డులెటుల పంప గలను?

వచనం: ఆ సైబరుక్షేత్రంలో వున్నవారందరూ నావారే! నా అడ్రస్సుబుక్కులోని వారే! అందులో బంధుమిత్రులు గురువులు శ్రేయోభిలాషులూ, బ్లాగువాసులూ యున్నారు. వారిపైన నా ఈమెయిళ్లను ఎటుల సంధించగలను? ఇది తప్పుకాదా? ఈ పని నేనెటుల చేసెదను?

**కృష్ణ ఉవాచ:**

దుర్జనా ఇక నీకు సైబురు గీతోపదేశమును చేయబోవుచున్నాను. శ్రద్ధగా వినుము. ముందుగా ధర్మయోగ సారమును తెలుపుచున్నాను, ఆలకింపుము.

సీ॥ ఎవ్వారు పెద్దలు ఎవ్వారు చిన్నలు
- అందరూ సరిసమానాంధులేను
ఎవ్వారు మిత్రులు, ఎవ్వారు శత్రులు
- మాయజాలమె నెట్టు! పోయి పడిరి!
నెట్టుధర్మాన్నిలా నెట్టుకుపోవయ్యా
- ఈమేళ్ళు పంపుతూ ఎవరికైన!
నాగాలు పెట్టక లాగాను చేయుచూ
- ధర్మాన్ని నడిపించు ధరన భరత!

వచనము: కలియుగమునందలి మొదటిపాదము పేరును ఇంటరునెట్టు యుగము అందురు. ఈ యుగమున పెద్దచిన్నల భేదములు కాని, మిత్రు శత్రువుల తారతమ్యములు కానీ యుండవు. ఈ కాలమందున బంధుమిత్రబంధాలు ఒక వల వలే పట్టి పీడించును గాన, దానిని నెట్టు యుగమని అనుచున్నారు. ఆ నెట్టుని నెట్టుకుపోవడమే మానవునకు ఈ యుగంలో నిర్దేశించిన ధర్మ మార్గము. అదే ధర్మయోగ సారము.

ఇక ఆత్మయోగ సారమునెరుంగుము.

సీ.॥ ఈమెయిలాత్మల కెట్టి తేడా లేదు
- రెంటికీ మరణము లేదు వినుమ!
డెలిటు బటను లేవి డెలిటు చేయను లేవు
- సర్వర్ల మిగులునీ సర్వజిత్తు!
కంప్యూటరొదిలితే కంప్యూటరింకోటి
- బట్టమార్చినటుల బయలుదేరు!
పునరపి జననము పునరపి మరణము
- మానవా వేదన మానవయ్య!!

వచనము: ఆత్మయన్నను ఈమెయిలు యన్నను తారతమ్యము లేదు. పాత బట్టలు విడిచి కొత్త బట్టలు దాల్చినటుల ఆత్మ శరీరములను మార్చును. ఈమెయిలు కంప్యూటర్లను మార్చును. రెంటికినీ మరణము సంభవించదు. నీవు వాటిని వధింప జాలవు. కనుక నీ వేదన మాని, విధ్యుక్త కర్తవ్యమును నిర్వర్తించుటయే ఆత్మయోగ సారమని ఎరుంగుము.

ఇక జ్ఞానయోగమును తెలిసికొనుము.

ఆ.వె.॥ అగ్ని కాల్చ లేదు ఆర్చదు వాయువు
నీరు తడుప లేదు, నీగు కాదు!
అస్త్ర శస్త్రములకు అందని ఈమైలు
నాశనంబులేని జ్ఞానభూతి!

వచనము: ఈ ఈమెయిలుని అగ్ని కాల్చ జాలదు, వాయువు ఆర్చ జాలదు, నీరు తడుప జాలదు, దానిని నివర్తించనూ జాలవు. అస్త్రశస్త్రము లేమియూ చేయజాలవు. అనగా ఈ ఈమెయిలుని ఎవ్వరునూ ఎన్నటికినీ వదిలించుకో జాలరు. అలా నాశనము లేని జ్ఞానైశ్వర్యమే ఇది.

ఇక కర్మ యోగసారమును, కర్మ, అకర్మ, వికర్మల నెరుంగుము.

కం.॥ నెట్టను మాయాజాలము
పుట్టిన వానిని వదలదు పోయేదాకా!
నెట్టుని ముట్టుటె ధర్మము
ముట్టకయుండినది తప్పు ముమ్మాటికినీ!

వచనము: నెట్టు అనునది కలియుగ మాయాజాలము. పుట్టినవారికి నెట్టును ముట్టుట తప్పదు. ఆ నెట్టును ముట్టుటయే కలియుగమున మానవునికి విధించిన

విహిత కర్మ. ముట్టకయుండిన అది అకర్మయగును. ముట్టిననూ నాకెందుకులే అని ఫార్వార్డు చేయ కుండుట వికర్మ యగును. అకర్మ, వికర్మలు తప్పని గ్రహించి, నీ కర్మను నీవు చేయుటయే కర్మయోగ సారము.

ఇక విభూతియోగసారము నెరుంగుము.

కం.॥ ఈమైలు పోయిననూ్న
ఏ మైలయు రాదు నీకు, యెన్నడు పార్థా!
ఆ మేలును మరువకయే
తామే ఫార్వార్డు చేయు తత్వము శ్రేష్ఠం!

వచనము: మానవులు పోయిన ఎడల మైల యను సంస్కారము వర్తించును. కానీ ఆత్మ వలే, ఈమెయిలునకు చావులేదు. కనుక ఈమైలు నిన్ను వీడిననూ నీకు మైల యన్నది కలుగక యున్నది. ఆ మేలుని గుర్తు యుంచుకుని ఫార్వార్డు తరువాత ఫార్వార్డు చేసుకునుచూ పోవుటయే విభూతియోగ సారము.

చివరిగా భక్తియోగసారము నెరుంగుము,

తే.గీ.॥ ఫలమునాశించు ఫార్వర్డు పనికిరాదు
ఫలమునాకొదులుచు, జయా పజయములను
మరచి, నీకర్మ యొనరుచు మయ్య పార్థ!
కర్మ సిద్ధాంతమందున మర్మమిదియె!

వచనము: ఏ ఫలాపేక్ష లేకుండా నీ పనిగా నీవు ఈ మెయిలు ఫార్వార్డులను ఓర్పుతో భక్తితో చేసుకొనుము. అదియే భక్తియోగసారము.

ఐనా,

తే.గీ.॥ ఈమెయిలునకే చింతన యింత పడిన,
ఫేసుబుక్కుని యింకెట్లు కాసుకొనుట?
వైరసుల ట్రోజనుల దాడి వైపు చూడు!
విశ్వరూప దర్శనమును వీక్షసేయి!

వచనము: అయినా ఈమెయిలుని చూచే ఇంత భీతిచెందినచో ఇక ఫేసుబుక్కులు, వైరస్సులు, ట్రోజానుల వంటి ఘోరమారణాయుధాలను ఏమి చేసెదవు. కర్తవ్య పాలన చేదుదైనను సరే, ధైర్యముతో నిర్వర్తించుము పార్థా! నీకు జ్ఞానబోధన చేయు నిమిత్తమున నా విశ్వరూపసందర్శనమును నీకు ప్రసాదించుచున్నాను. వీక్షించుము.

**దుర్జన ఉవాచ :**

గేయం॥ ఓ దేవదేవం, ఆద్యంత్యరహితం, మహాదివ్యతేజం, మహాకాలఖాయం, మహాఘోర రూపం, మహారౌద్రనాదం, మహాపాపనాశం, విరూపాస్వరూపం, సరోరాసరూపం, అనంతం దిగంతం, మహేశం హరీశం, అనేకం స్వరూపం, సదాసత్యధామం ..... ..... మంచోళ్ళు చెడ్డోళ్ళు దైవాలు దెయ్యాలు, నీలోనే పుట్టేను నీలోనే గిట్టేను టెక్నాలజీగాని, కంప్యూటరేగాని, ఈమైలు స్పామింగు, వైరస్సు ట్రోజాను, మాల్ వేర్లు స్పైవేర్లు, వోర్ములు జెర్ములు, ఫేస్బుక్కు ట్విట్టర్లు, పిష్షింగు స్పూఫింగు, చాటింగు చీటింగు, బ్లాగింగు గేమింగు, కుక్కీలు రౌటింగు, అన్నింట యున్నావు, అన్నీను నీవేను, సృష్టంతా నీదేను, మొత్తంబు నీ వేనయా ..... ..... ఆ భీకరంబైన నీ విశ్వ రూపాన్ని, శాంతింప చేసేసి, మామూలు రూపాన, నాకోర్కె తీరంగ, ఆబాల గోపాల మాపాలి శాంతించు, గోవింద రక్షించు కాపాడు దీవించు, ఓ కృష్ణుడా! .....

# ఉగాది

*– మాతా గంగాభవానీ శాంకరీదేవి*

స్వాగతంబు యుగాదికి సాదరమున,
నవ్యవత్సరము వికారి దివ్య వరము,
కలుష కక్షలు విడనాడి కరుణ యున్న,
నేస్త భావాలు ధరణిన నెలవు దీరు

కోయిలమ్మ గానము కొత్త కోరికెగసి,
మదిని నూతనోత్సాహము మంపు గొలుప,
ప్రకృతి నూతన సొబగులు పరిఢమించి,
నవ్య జీవన శోభలు నవతరించు

మంగళ కరము కల్యాణ మహితనామ,
సృష్టినద్భుతముగ నిల్పి శ్రీ కరముగ,
సస్య శోభల నందించు సత్యరక్ష,
జయము శుభకర దేవర జయ గుణకర

కీడు కలుష దోషాలను కిటుకు జేయు,
మనుజ వర్యుల మనుగడ మార్పుజేసి,
నేరమెంచక నెనరుతో నీలకంఠ
మిన్న జీవన మందించి మేలు సలుపు

నవ్య వత్సర మాద్యంత నవ్వు గూడి
విరుల మధుర సౌరభములు పరిమళించి,
నూత్న భాసుర జీవిక నొసగుదేవ,
వేడు కొందుము సతతము వేదవేద్య

# పెసరట్టు దండకము

*– జొన్నలగడ్డ శ్రీనివాసరావు*

శ్రీమన్మహాదివ్య ఖండీర ప్రాదుర్భవంబైన పెస్రట్మహా భక్ష్యమా నీకు జోహార్లు! నే ముద్గ సూపంబునుందెచ్చి నానంగ బెట్టించి యల్లంబు నామిర్చి దట్టించి మెత్తంగ రుబ్బించి యాయుప్పు నాజీలకఱ్ఱందు గల్పించి స్టౌమంట బెట్టించి పేనాము నెక్కించి యాజ్యంబు నున్ వ్రాసి యాపిండి నివ్వర్తులాకారముందీర్చి మాతల్లి నీరుల్లి యల్లంబు నామిర్చిలన్ వేసి యింకాస్త యాజ్యంబు నింపారగా వేసి యాప్రక్క నీప్రక్క చక్కంగ గాల్పించి పళ్లెంబునందీసి యుప్మాను జోడించి యల్లంపు చట్నీలు నానారికేళంపు చట్నీలు నంజుండు గాజేర్చి వయ్యారముంజూపి యిల్లాలు వడ్డింప నీయొంపు నీసొంపు నిండార వీక్షించి నీయొక్క స్వాదమ్ము నామానసంబందు మాగొప్ప గాదల్చి నే స్వీకరింపంగ నాజిహ్వా చాపల్యముందీర్చి క్షుద్బాధ దీర్పంగ నాస్వర్గ మేలమ్మ నీవున్న చాలమ్మ నీమేలు నీజన్మలో నేను మర్వంగ లేనమ్మ నీవంటి ఖాద్యంబు నీలోక మందెచ్చుట న్గాంచ లేమమ్మ యాబాల గోపాల ముత్సాహముంజూపి నీరూపు వర్ణించి నిన్మెక్కి నీస్వాదమున్మెచ్చి నీ కీర్తినే దల్చునో తల్లి పెస్రట్మహా ఖాద్యమా నీకున్నమస్తే నమస్తే నమస్తే నమః!

# శ్రీనివాస 'చిత్రాలు'

– జొన్నలగడ్డ శ్రీనివాసరావు
టీచరు, తొత్తరమూడి, తూర్పు గోదావరి

బట్టబుఱ్ఱకంటె భాగ్యంబు లేదంచు
పలుకవచ్చు జుట్టు పలుచనైన
మొత్తమూడెనేని ముదమందవచ్చుగా
గుండు తడుముకొనుచు గొప్పగాను.

తిక్కపిల్ల యొకతె యక్కమగనిఁగూడి
తీర్థయాత్రఁజేసె తెలివి లేక
యక్కమగడు దీనినదనుగా గైకొని
తక్కిన పనినెల్లఁజక్కబెట్టె

సంతుకొఱకటంచు స్వాముల నడిగితాఁ
సప్తసంద్రములను స్నానమాడ
యుప్పుగాలి తగిలి యుడిగిపోయెను శక్తి
చిత్రమిదియె కనుమ శ్రీనివాస!

జుట్టు మొలచుననుచు గట్టి యత్నముఁజేసి
మందువాడినాడు మహిని నొకడు
బోడిగుండు పైన బొచ్చెట్లు మొలకెత్తు
చిత్రమిదియె కనుమ శ్రీనివాస!

అల్లుడైతివంట యాకాశరాజుకుఁ
బ్రేమతోడ పద్మఁబెండ్లియాడి
యామె యేలమరల నలమేలుమంగమ్మ
చిత్రమిదియె కనుమ శ్రీనివాస

సిరుల నిచ్చు తండ్రి శ్రీనివాసుడవయ్య
యప్పులేల నీకు నవని లోన
వందలాదికోట్లు వడ్డీగఁజెల్లింప
చిత్రమిదియె కనుమ శ్రీనివాస

పత్నియొకతె చాలు పరకాంత వలదంచు
నీమమందితీవు రామచంద్ర
వెన్నదొంగకేల వేవేల భార్యలు
చిత్రమిదియె కనుమ శ్రీనివాస

అక్షరములు రాక యల్లాడు విద్యార్థి
గ్రంథమెట్లు చదువు ఘనము గాను
గసడదవలు రాక ఘనపాఠి యెట్లగున్
చిత్రమిదియె కనుమ శ్రీనివాస

కట్నము వలదంచుఁగనికరమును జూపి
లాంఛనముల పేర లక్షలడిగి
వరునితల్లిదండ్రి వాటంబు గాదోచు
చిత్రమిదియె కనుమ శ్రీనివాస.

చీరకట్టు రాదు చిత్రమౌ తలకట్టు
నెత్తుజోళ్లు పెదవి కెఱుపురంగు
నాధునికపు యువతి యాహార్యమీరీతి
చిత్రమిదియె కనుమ శ్రీనివాస

తెలుగు భాష రాక తెఱనేలగావచ్చి
రన్యభాష భామలందరిటకు
నాంధ్ర దేశమందు నందగత్తెలె లేర
చిత్రమిదియె కనుమ శ్రీనివాస

# తొలి ఉగాది

– రజనీ సుబ్రహ్మణ్యం

బాపూ బొమ్మలా అపరాజితకి పెద్ద జడ వుండేది. బి.ఇ.లో చేరగానే మెయిన్‌టైన్ చేయటం కష్టం అని కట్చేసేసింది. బాపూ బొమ్మ బాబ్ బొమ్మఅయింది. బి.ఇ. ఎగ్జామ్స్ కాగానే తండ్రి పెళ్లి చేసేసారు. అమెరికా వెళ్లి యమ్.స్. చేయాలన్న కోరిక ఎప్పుడు తీరుతుందో! దేవాంష్ యమ్.టెక్. చేసి జి.ఇ.లో వుద్యోగం చేస్తున్నాడు. దేవాంష్ తాత హేతువాది. కాని తండ్రి ఆధ్యాత్మికవాది అందుకే దేవాంష్ కి ఆ పేరు పెట్టారు. ఇక అపరాజిత తండ్రికి సత్యజత్ రే అంటే విపరీతమైన అభిమానం. నోవాటెల్లో ధూమ్ ధామ్ రిసెప్షన్ జరిగాక హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వచ్చేసింది. ఇందిరానగర్‌లో ఇల్లు, దగ్గరలో లిడోమాల్, చుట్టూ సినిమాహాల్స్ ఎంతో అమర్చినట్లుంది జీవితం. దేవాంష్ రోజూ బ్రిగేడ్ రోడ్, కమర్షియల్ స్ట్రీట్, సినిమాలకి తీసుకువెళ్ళు తూనే వున్నాడు. సరదాగా, సందడిగా వుంది. తొలిఉగాది. అపరాజిత, దేవాంష్ బెంగుళూరు లోనే జరుపుకోవాలను కొన్నారు. ప్రక్కింటి తెలుగావిడ హిమబిందు గారి దగ్గరకు వెళ్ళింది. వాళ్ళది స్వంత ఇల్లు. బెంగుళూరు లోనే స్థిరపడ్డారు. “ఆంటీ, ఉగాది పచ్చడి ఎలా చెయ్యాలో చెప్పరా! గారెలు కూడా చేయాలి” అడిగింది అపరాజిత. ఎలాచేయాలో చెప్పారు హిమ బిందు గారు. వేపపువ్వు పార్కులో దొరుకుతుంది అనికూడా చెప్పారు. “మీరు కూడా పెళ్ళి అవగానే వచ్చేసారు కదా ఆంటీ!” అడిగింది.

“అవునమ్మా. నీలాగే ఎమ్.ఏ., పెళ్ళి తరువాత ఇక్కడి కొచ్చాను. ఇన్ని హెూటల్స్ కూడా వుండేవి కావు. కోషిస్, ఉడ్లాండ్స్, బృందావన్, కావేరి దగ్గరలో వుండేవి. ప్రతి వంట తెలుగువాళ్ళని అడిగి నేర్చుకోనే దాన్ని. ఉప్మా, వొబ్బట్లు మాత్రం కన్నడవాళ్ళ దగ్గరే”! చెప్పారు హిమబిందు గారు. “అప్పుడు బెంగుళూరు ఎలా వుండేది ఆంటీ?” “ఆ బెంగుళూరు ప్యారడైజ్ అమ్మా. అసలు ఇండయాలో కాదు ఇంగ్లండ్లో వున్నట్లు వుండేది. ఒకవైపు సంప్రదాయం ప్రవహిస్తున్నా ఇంగ్లీషు ప్రభావం ఎక్కువ. రోజూ తుంపర పడుతూ వుండేది. సాయంత్రం వర్షం. ఆ వర్షంలోనే నేనూ, అంకుల్ లిడోకి ఇంగ్లీష్ సినిమాలకు, మెజెస్టిక్ కి తెలుగు సినిమాలకు స్కూటర్ మీద వెళ్ళే వాళ్ళం” ఎంతో భావుకతతో అన్నారు. హిమబిందు గారు. “వింటూవుంటే హాయిగా వుంది ఆంటీ. మళ్లీ వస్తాను. పార్కుకు వెళ్ళి వేపపువ్వు తెచ్చుకోంటాను. ”అని చెప్పి అక్కడనించి ఇంటికి బయలుదేరింది అపరాజిత. కంప్యూటర్ ముందు పనిచేసు కొంటున్న దేవాంష్ పట్టుచీరలో వున్న అపరాజితని చూసి “ముద్దు వస్తున్నావు అప్పూ” అన్నాడు. “నిజంగా!” అంది సిగ్గుగా. అంతలోనే “పార్కుకి, గుడికి వెళ్ళొస్తాను” అంది. గుడి, పార్క్ ఒకచోటే. నిజంగా జీన్స్, టీషర్టుతో తిరిగే అపరాజిత పట్టుచీరలో,తలంటుకొన్న జుట్టుతో ,బొట్టుతో ముచ్చటగా వుంది. హిమబిందు గారూ చూడగానే అదే మాటన్నారు. గుడిలో చాలా హడావుడిగా వుంది. కన్నడిగులకు ఆరోజే ఉగాది. “నాకు జిఇ.లో వుద్యోగం వచ్చేట్లు చూడుస్వామి” అని దండంపెట్టుకుని బయటకు వచ్చింది. తోటమాలి యశ్వంత్ అందరికి మామిడి ఆకులు, మామిడి కాయలు, వేప పువ్వు యిస్తున్నాడు. అపరాజిత కూడా తీసుకొంది. అక్కడే వున్న షీన్సీ కేరళా అమ్మాయి వాట్ ఫెస్టివల్ అంటూ అడిగింది. “న్యూ ఇయర్ లైక్ యువర్ విషూ’’ అని జవాబుయిచ్చింది. ఇంటికి వచ్చి హడావుడిగా వంట గదిలోకి వెళ్ళింది. “అపరాజితో! ఏమిటి ఉగాది స్పెషల్? మీవాళ్ళు, మావాళ్ళు రమ్మన్నా వెళ్ళలేదు” అన్నాడు హాస్యంగా దేవాంష్. “అంషూ!

వాళ్ళకి మురిపెంగానీ నీకు సెలవు దొరకాలిగా" అంది. అతి శ్రద్ధగా ఉగాది పచ్చడి, గారెలు, పాయసం చేసి దేవుడికి నైవేద్యం పెట్టి, చిన్న పూజ చేసుకొని అన్నీ టేబుల్ మీద సర్దింది.

ఇద్దరూ, కబుర్లు చెప్పుకుంటూ ముందు ఉగాది పచ్చడి తిని గారెలు, పాయసంతో ముగించారు. "మధ్యాహ్నం లైట్‌గా చెయ్యి. సాయంత్రం తెలుగు సమితి కార్యక్రమానికి వెళ్దాం" అన్నాడు. గాయత్రీ మంత్రం కాలింగ్ బెల్ మ్రోగింది. హిమబిందు గారు హాట్, స్వీట్ పంపించారు. సాయంత్రం బెనారస్ చీర కట్టుకుని, పెద్ద జూకాలు, కెంపుల నెక్లెస్‌తో తయారైంది. సిల్క్ లాల్చీ, సిల్క్ పంచెకట్టులో దేవాంష్ రెడీ. "అంషూ, పెళ్ళికొడుకులా వున్నావు" "మళ్ళీ శోభనం చేసు కొందామా?"అన్నాడు చిలిపిగా. సిగ్గుపడిపోయింది అపరాజిత. ఇద్దరూ నవ్వుకొంటూ మోటారు బైక్ మీద సదాశివ నగర్ బయలుదేరారు. రాజభవన్ దగ్గరకు రాగానే దేవాంష్ బండి ఆపాడు. ఎందుకో తెగ దగ్గుతున్నాడు. వెంటనే గాభరాగా బండి దిగింది అపరాజిత. ఈలోపు బైక్ స్టార్ట్‌చేసి దేవాంష్ వెళ్ళిపోయాడు. అపరాజిత బిక్కమొహం వేసుకుని నిల్చుంది. ఎదురుగా వచ్చిన స్కూటర్ అబ్బాయి" ఆర్యు ఎవేర్ ఆఫ్ బెంగళూరు?" అన్నాడు. "యస్" అనగానే అతను వెళ్ళిపోయాడు. ఓలాని పిలుద్దామా అని అనుకొంటూండగా "ఏమిటి ఇక్కడ దిగి పోయావు?" అంటూ తిరిగి వచ్చాడు దేవాంష్. చిన్న సంవాదన తరువాత పది నిమిషాల్లో చౌడయ్య మెమోరియల్ హాల్ చేరుకున్నారు. బయట కూడా ఎంతో కోలాహలంగా వుంది. కార్యకర్తలు ఆహ్వానించి లోపలకు తీసుకెళ్లారు. లోపల అంతా సందడే సందడి. కబుర్లు, కబుర్లు. ఈ చిన్న జంటని అందరూ అక్కున చేర్చుకొన్నారు. అభినందించారు. శుభాకాంక్షలు చెప్పారు. కాసేపటికి సభ ప్రారంభం అయింది. జ్యోతి ప్రజ్వలన, ప్రసంగాల అనంతరం బారిస్టరు పార్వతీశం నాటకం మొదలైంది. అపరాజిత, దేవాంష్ నవ్వుతూ, నవ్వు ఆపుకొంటూ నాటకంలో లీనమై పోయారు. హాల్ అంతా ఈలలే ఈలలు. అన్ని తరాలు వాళ్ళు హాయిగా ఆనందించారు. నాటకం అయిపోయింది. అందరూ కరచానాలు, కౌగిలింతలుతో వీడ్కోలు తీసుకొన్నారు. ఇళ్ళకు బయలు దేరారు. దారి పొడగూతా దేవాంష్ పార్వతీశం నవల గురించి, ఐ డిడ్ ఇట్ ఎట్ ద కార్నర్ ఆఫ్ ద స్ట్రీట్ జోకు గురించి చెప్తూనే వున్నాడు. అపరాజిత నవ్వుతూనే వుంది. ఇంటి దగ్గర బండి దిగగానే వెంకటగిరి చీరలో అందంగా ఎదురు వచ్చారు హిమబిందు గారు. "బాగున్నారు ఆంటీ హిమబిందు లాగే" అంది అపరాజిత ప్రశంసగా. "మీరిద్దరూ మెరిసి పోతున్నారు. దిష్టి తీసుకోండి. పులిహోర, బొబ్బట్లు చేసాను. తినండి అమ్మా!" అంటూ క్యారియర్ ఇచ్చారు. "ఎన్ని ఫలహారాలు యిచ్చారు ఈరోజు ఆంటీ!" అని ఇద్దరూ ధన్యవాదాలు చెప్పి ఇంట్లోకి వెళ్ళేసరికి తల్లి ఫోన్. "అమ్మా!" అంది సంబరంగా అపరాజిత. "అప్పూ, ఎట్లా చేసుకున్నారు పండుగ?" అడిగింది అపరాజిత తల్లి మాధవి. అన్నీ ఏకరువు పెట్టింది అపరాజిత హిమబిందుగారి టిఫిన్లతో సహా. మాధవిగారు సంతోషపడి పోయారు. "నువ్వు వంట చేస్తున్నావంటే ఎంతో ఆనందంగా వుంది, అప్పూ. పెళ్లి అయితే వంట ఎట్లా చేసుకొంటావని దిగులుగా వుండేది" అనికాసేపు అల్లుడుతో కూడా మాట్లాడి ఫోను పెట్టేసారు. దేవాంష్, అపరాజితల సరస సంభాషణలకు అంతే లేదు. గుర్తు వచ్చి పులిహోర, బొబ్బట్లు తిన్నారు. "మన సంవత్సరాది ఎంత బాగా జరిగిందో!" మురిసిపోయింది అపరాజిత "ఇక పడుకొందామా. రేపు ఆఫీసు వుంది" అన్నాడు దేవాంష్. రాత్రంతా సరస సంభాషణలతో, సల్లాపాలతో గడచిపోయింది. మరో శుభోదయం.

# అద్వైతం - దీక్షితత్వం



- *శ్రీధర్ దీక్షిత్ :*
*శారద కాశీవఝుల*
*వీర్ల గంగాధర్*

కొంతమంది కారణజన్ములే కళపట్ల, చేస్తున్న పనిపట్ల అనన్యమైన భక్తి శ్రద్ధలను పెంచుకుంటారు. ఎంచుకున్న నటనలాంటి రంగాలలో ఉత్కృష్టస్థానం అందుకుంటారు. ఆ సమూహంలోనూ కొంత మందే జ్ఞాన సంపన్నులై కూడా పరమ నిగర్వులౌతారు. అరుదైన ఆ చిన్ని గుంపులోంచే మరీ కొంతమందే లాభాపేక్ష లేకుండా క్రమశిక్షణతో శిక్షణనిచ్చే గురువులౌతారు. తెలిసిన వారు, తెలియనివారు అని వ్యత్యాసం చూపకుండా స్వార్థం లేని పరోపకారాలూ, త్యాగాలూ అవలీలగాచేస్తుంటారు. అంతటి అగ్రస్థానం చేరుకునే దారిలో ఎన్నిటినో కోల్పోతారు, ఎందరో మనుషులని వదులుకుంటారు. కానీ ఇటు కొడుకుగా, భర్తగా, తండ్రిగా, తాతగా, నటుడిగా, స్నేహితుడిగా, గురువుగా, వక్తగా, మహా మనిషిగా ఇంత మంది శిష్యులనీ, స్నేహితులనీ సంపాదించుకుని జీవితాంతం మనిషితనంతోనే బతికిన వాళ్ళెవరైనా తెలుసా అంటే నిస్సందేహంగా దీక్షిత్ మాష్టారుని చూపించవచ్చు. వయోభేదం, స్థాయి వ్యత్యాసం పాటించక అందరినీ ఆదరించి ప్రేమించే మంచి మనసుకి ఎక్కడ ఉన్నా ప్రపంచమంతా అభిమానులే. ఎటు వెళ్ళిపోయినా, మిగిల్చి వెళ్ళిన చిరకాలపు జ్ఞాపకాలే. ఎన్ని జన్మలైనా కృతజ్ఞతాశ్రువులతో నిండిన అంజలులే. సమయా సమయాలూ, సరిహద్దులూ, స్వ-ఆరోగ్యంచూసుకోకుండా ఎంతదూరం అయినా ప్రయాణించి వచ్చే అంతులేని వాత్సల్యం తలచుకుంటే పూడ్చలేని అగాధమైన లోటే మీ అస్తమయం!

తెలుగు నాటకం అనే మాట విన్నప్పుడు, అన్నప్పుడు ఎంత గాంభీర్యంగా ఉంటుందో.. అంతకు మించి సమాజం కోసం లెక్కలేనన్ని బాధ్యతల్నీ ఎన్నోఏళ్ళుగా తెలుగు నాటకం తనభుజాన మోస్తూ వస్తుందనేదీ అక్షర సత్యం. నాటకం అంటేనే సమ్మోహన కళ. ఆ సమ్మోహనంలో చైతన్యాన్ని నింపే సుగంధ కవనాలు, రసరమ్య గమనాలెన్నో. అందుకే 'నాటక కళ' సమాజాన్ని ప్రభావితం చేసే అత్యుత్తమమైన కళల్లో ఒకటయ్యింది. తెలుగు నాటకానికీ ఇంతటి ఘనమైన చరిత్రే ఉంది. కళారూపంగానే కాదు, మనో, వైజ్ఞానిక, కళా వికాసానికి గళమెత్తిన ఎందరో మేటి నటుల్ని, భవిష్యత్ దార్శనికుల్ని తెలుగు నాటకం ఈ సమాజానికి అందించింది. అలా నాటక కళ కోసం.. నాటక రంగం కళకళలాడటం కోసం.. తనంతట తానుగా, తనతో అనేక మందిగా, నటకులానికే వారథిగా, వారసుడిగా జీవితాంతం బతికిన వాడే డి.ఎస్. దీక్షిత్ మాష్టార్.. అలియాస్ దీవి శ్రీనివాస దీక్షిత్.

డిఎస్ దీక్షిత్ నాటకరంగానికి చెందిన మనిషి.. అని ఆయన్ని ఒకరంగానికి మాత్రమే కుదించేసి, పరిమితం చేయడం అంటే పెద్ద సాహసమే. నాటకం మాత్రమే కాదు, సినిమా, టీవి, సాహిత్య రంగాల్లోనూ ఆయన పాత్రోచిత ప్రయాణం అసామాన్యం. నాటకమే ధ్యాస, శ్వాస, ఊపిరి, జీవితం అనే ఉపమానాలన్నిటికీ దీక్షిత్ కళా జీవిత ప్రయాణమే.. ఓ ఉదాహరణ. నటనంటే ఎంత

ప్రాణం పెట్టుకోకపోతే.. నటిస్తూనే తుదిశ్వాస విడుస్తారాయన! నటుడిగా సీరియల్‌లో ఓ పాత్రపోషిస్తుండగా.. షూటింగ్ సమయంలోనే హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లో మరణించారు ఆయన. సొంతూరు గుంటూరు జిల్లాలోని తెనాలికి దగ్గరలో గల కొలకలూరులో ఫిబ్రవరి 20వ తేదీన ఆయన శిష్యులు, నాటకరంగ ప్రముఖుల సమక్షంలో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తెలుగు సినిమా నటుల సంఘం లోనూ తనో సభ్యుడు కావడం, అదే సినిమా రంగానికి చెందిన ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులు, యువదర్శకులు ఆయనకు శిష్యులు కా వడంతో ఫిలిం ఛాంబర్‌లోనూ ఆయన భౌతిక కాయాన్ని ఉంచి, దీక్షిత్ మాష్టారికి గౌరవ ప్రదమైన అంజలి ఘటించారు.

రంగస్థలాన.. బాహుబలి!

నాటకాల గురించి తెలియని, పెద్దగా పరిచయం లేనివాళ్ళకు.. డి.ఎస్. దీక్షిత్ అంటే.. 'మురారి, అతడు, ఇంద్రలాంటి సినిమాల్లో కీలక సన్నివేశాల్లో కనిపించినాయనే కదా..! అని అనుకోవచ్చు. నిజానికి నటుడుగానే కాకుండా ..మిగతా సినిమాలతోనూ ఆయనకు చాలానే అనుబంధం ఉంది. ఆయన సినిమాయేతర రంగస్థల విశేషాల్లోకెళితే నిజంగానే.. ఓ బాహుబలి లాంటి వాడు. తెలుగు నాటక రంగాన ప్రసిద్ధు లైన పద్మశ్రీ ఏ.ఆర్. కృష్ణ శిష్యుడిగా, డా. అక్కినేని అభినయ గురుకుల పాఠశాల వ్యవస్థాపకునిగా, నటునిగా, నాటక దర్శకునిగా, ప్రయోక్తగా ఇలా ఆయన సుదీర్ఘకాలంగా తెలుగు నాటక రంగాన పోషించిన పాత్ర, చేసిన సేవలు శిఖరాయమానం. అయితే, వీటన్నిటి కంటే మిన్ననైంది ఆయనలోని మానవీయ గుణం. బతికినంత కాలం ఏదో ఒక గ్రూపునకు పరిమితం కాకుండా.. అందరితో మెలిగారు. ప్రాంతాలకు అతీతంగా శిష్యగణ సంపదనూ పోగేసుకున్నారాయన. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ.. దీక్షిత్ మాష్టారి ఆత్మీయ పలకరింపునకు, కర స్పర్శకు పులకించని రంగస్థల నటులు లేరంటే అతిశయోక్తి కాదేమో! ఒకరా.. రెండా.. ఆయన శిష్యగణం వేలల్లోనే.

సంప్రదాయ నాటక రంగాన పౌరాణిక నాటకం, సాంఘిక నాటకం కోసం ఆయన చేసిన సేవలు ప్రత్యేకమైనవి, అంతే వైవిధ్యం గలవి. ప్రస్తుత నాటక అకాడమీ ఛైర్మన్, పౌరాణిక నాటక రంగ నటుడు గుమ్మడి గోపాలకృష్ణ శ్రీకృష్ణ పాత్రలో దీక్షిత్ మాష్టారు దర్శకత్వంలో రూపొందించిన 'శ్రీకృష్ణ రాయబారం' తెలుగు రంగస్థలాన ఓ సంచలనమైంది. ఆధునిక రంగాలంకరణ, భారీ సెట్టింగులు, అంతే భారీ తారాగణంతో నేటి తరాన్ని సైతం ఆకర్షించేలా, ఆకట్టుకునేలా రూపొందించిన ఆ నాటకం అమెరికా వంటి ప్రవాస వేదికలపైనా తారాడింది. ఇక 'నాన్న సూక్తం' వంటి పలు సాంఘిక నాటకాల్లో దీక్షిత్ మాష్టారు చూపించిన వైవిధ్యం అంతా ఇంతాకాదు. నాటకం ఒక్కటే కాదు, సినిమా రంగానికి చెందిన నటులకు సంభాషణలు (డిక్షన్) నేర్పించడంలో ఈ మాష్టారి శిక్షణ పరిశ్రమలో ఓ ప్రత్యేకం. నటుడు పవన్ కల్యాణ్, సునీల్, అల్లరి నరేష్, ఆర్యన్ రాజేష్, ఉత్తేజ్ వంటి వందలాది నటులు దీక్షిత్ నట శిబిరం నుంచి తర్ఫీదు పొందినవారే!

నటన.. అనేది వారసత్వంగా అబ్బే కళ కాదు. అదేదో.. జన్మతా వచ్చే బ్రహ్మపదార్థం

అంతకన్నా కాదు.. అనేది దీక్షిత్ మాష్టారు ఎప్పుడూ నమ్మే, చెప్పే మాట. అందుకే.. ఆయన నిత్యజీవితంలో ఎక్కడ ఏ వేదికపైన మాట్లాడినా 'నటన కాదు వరం.. అదికృషి సాధనల స్వయం వరం' అంటూ మొత్తం నటన అనే కళలోని అంతర్లీన సారాంశాన్ని ఒక్కవాక్యంలో చెప్పేవారు. ఇదే.. ఆయన జీవితాంతం అనుసరించిన, ఆచరించిన సిద్ధాంతం కూడా.

ఇదీ.. మాష్టారి గురుకుల శిక్షణ – నటనపై ఆసక్తి ఉన్నవారి కోసం, వారిలోని ఔత్సాహిక నటనా భిరుచిని పరిణతిగా మలచడం కోసం నిత్యం తపనపడే వారు దీక్షిత్ మాష్టారు. అలా సుదీర్ఘకాలం పాటు ఓ యజ్ఞంలా.. నట శిక్షణా రంగంలో అభినయ విద్యను తనదైన శైలిలో, శాస్త్రీయంగా రూపొందించి, పదిమందికి పంచిపెట్టిన వాడు ఆయన. అందుకే నాటకరంగం ఆయన్ని 'అభినయ విద్యావాచస్పతి'గా కొనియాడింది. కేవలం నటన పట్ల ఆసక్తి ఉంటే సరిపోదు.. అందుకు కావాల్సినవి చాలానే ఉంటాయి. అందుకు సమాయత్త మైతేనే.. నటనా రంగంలో నిలబడ గలరనే ఓ దృక్పథాన్ని విద్యార్థుల మెదళ్ళలో నాటడంలో మాష్టారి ఒరవొడి వేరు. అభిరుచి కంటే.. వ్యక్తిగత క్రమశిక్షణ ముఖ్యమంటూ దశాబ్దాలుగా.. గురుకుల పద్ధతిలో నట శిక్షణా శిబిరాలను నిర్వహించడం మరెందరికో మార్గదర్శకంగా, ఆదర్శంగానూ నిలిచారు. నట శిక్షణా సంస్థలతో పెద్దగా అనుబంధం పెట్టుకో వడానికి ఏమాత్రం ఇష్టపడని నటులు అక్కినేని నాగేశ్వరరావు స్వయంగా దీక్షిత్ మాష్టారి నట శిక్షణ శిబిరంలో శిక్షణ పొందే విద్యార్థులతో తన నటనానుభవాలను పంచుకునేవారు. ఇలా డా॥ అక్కినేనికే కాదు, దీక్షిత్‌లు మాష్టారి శిష్యులు అంటే చిత్ర పరిశ్రమలోనూ ఓ ప్రత్యేకమైన గౌరవం. తేజ లాంటి దర్శకులు ఈయన శిష్యుల ప్రదర్శనలు చూశాక ఆడిషన్ జరపకుండా పలు సినిమాల్లో నటులుగా తీసుకున్న సందర్భాలూ ఉన్నాయి.

మాష్టారికి తగ్గ అన్నపూర్ణమ్మ – దీక్షిత్ మాష్టారి సహచరి లక్ష్మీ చిత్రలేఖా దీక్షిత్ మూడేళ్ళ క్రితమే మరణించారు. ఈ దంపతులకు శ్రీధర్ ఒక్కడే కుమారుడు. అయితే ఈ మాష్టారు మాత్రం.. శిష్యగణమంతా తన కన్నబిడ్డలతో సమానమే అనేవారెప్పుడూ. అందుకు తగ్గట్టుగానే మాష్టారి ఇంటి వాతావరణం ఎప్పుడూ ఓ కాలేజీ హాస్టల్లా ఉండేది. దీక్షిత్ మాష్టారి శిష్యులు చాలామంది ఆయన ఇంట్లోనే ఉండేవారు. ఇలా ఉండేది ఒకరు ఇద్దరు మాత్రమే అని చెప్పలేం, మాష్టారి భార్య బతికున్నంత వరకూ నిత్యం విద్యార్థులతో కళకళలాడేది. ముఖ్యంగా మాష్టారి గారి భార్యను విద్యార్థులంతా 'అమ్మ అమ్మా..!' అంటూ అల్లుకు పోయేవారు. ఆయన ఇంటికి ఎవరెళ్ళినా.. భోజనం చేయకుండా తిరిగిరావడం జరిగేది కాదు. ఇలా.. శిష్యులందర్నీ – నాబేధం లేకుండా అక్కున చేర్చుకుని, వారంతా నటనా రంగంలో స్థిరపడే దాకా.. సొంత అమ్మ, నాన్నలా చూసుకునేవా రావిడ. అలా నిత్యం ఎంతో మందికి కడుపు నిండా భోజనం పెట్టి, ఆదరించిన లక్ష్మిగారిని విద్యార్థులూ అంతే ఆప్యాయంగా అన్నపూర్ణమ్మగా పిలుస్తారు. ఇలా కళారంగంలో వ్యక్తిగా కంటే నలుగురి కోసమే బతికారు దీక్షిత్ మాష్టారు దంపతులు.

మాష్టారంటే.. సినిమా, నాటక రంగంలో చేసిన సేవల గురించి మాత్రమే చెప్పుకుంటారు చాలామంది. కానీ, ప్రారంభంలో 'పిల్లలూ

నాటకాల్లోకి రావాలి. వారికి నాటకం నేర్పాలి.. అదివారి విద్యా, మనోవికాసానికి ఎంతో దోహద పడుతుందంటూ..' బాలల కోసం ప్రత్యేక నట శిక్షణా శిబిరాలనూ నిర్వహించారు. రచయిత పనసాల నిర్వహణలో దశాబ్దకాలం పాటు నడిచిన చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్ కార్యక్రమాలకు, బాలల సాహిత్య ముద్రణలకూ దీక్షిత్ మాష్టారు వెన్ను దన్నుగా నిలిచారు.

పదవులకు పాకులాడని మనిషి – నిజానికి లలిత కళల్లో ఏదో ఒక అకాడమీకి ఛైర్మన్‌గానో, సాంస్కృతిక శాఖలో ముఖ్యమైన హెూదాలోనో ఉండాల్సినంత కళాసేవ చేశారు దీక్షిత్ మాష్టారు. కానీ, అవసరమైన సమయాల్లో మాష్టారిలాంటి ప్రతిభగల వ్యక్తులు, శక్తులూ ప్రభుత్వానికీ గుర్తుకు రాకపోవడం శోచనీయమే. అయితే, మాష్టారు ఏ రోజూ పదవుల కోసం ఎవరి చుట్టూ తిరగలేదు. ఎవరి ముందూ చేతులుకట్టీ నిలబడలేదు. తన వెలుగుతో ఓ వెలుగు వెలుగుతున్న కళాకారులు.. ప్రభుత్వంలో వివిధ పదవుల్లో వెలుగుతున్న తీరునూ తను చూశారు గానీ, తన కోసం తన కుటుంబం కోసం ఎప్పుడూ ఎవర్నీ అడగలేదు. ఏమీ మిగుల్చుకోలేదు. కళను నమ్మారు.. చుట్టూ ఉన్న మనుషుల్నీ అంతే నమ్మారు.. కానీ నమ్మిన వాళ్ళు.. తన ప్రభావితమైన మేధస్సుతో ఎదిగిన వాళ్ళలో ఎంతమంది గురుదక్షిణగా ఆయన బొటనవేలు కొరికి పారిపోయారో..ఆయనకు మాత్రమే తెలుసు. తెలిసినా.. చిరునవ్వుతో కరచాలనం చేసే వ్యక్తిత్వం మాష్టారిది. నిజంగానే.. డీ.ఎస్. దీక్షితులు గారి అకాల మరణం. తెలుగు నాటక రంగానికి ఓ తీర్చలేని లోటే. కానీ వెళ్తూ.. వెళ్తూ.. మన ముందు అనేక ప్రశ్నలు వదిలి వెళ్ళారాయన. ప్రతిభకు పైరవీలు అడ్డుపడితే దీక్షిత్ మాష్టారు లాంటి వారికి ఎంతటి అన్యాయం జరుగుతుందో చెప్పకనే చెప్పి మరీ వెళ్ళారు. మాష్టారూ.. మీరు అన్నట్టే – నటన కాదు వరం. అది కృషి సాధనల స్వయంవరం!!

# ఉగాది పండుగ వచ్చే మధుమాస విశిష్టత

– డా॥ అక్కిరాజు రమాపతిరావు

ఉగాది పండుగ తెలుగు వారికి అత్యంత ప్రమోదావహమైనది. చైత్రమాసాన్ని వర్ణన చేయని తెలుగు కవి వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఒక్కరూ కనపడరు. ఉగాది పండుగతో ప్రారంభమయ్యే మాసానికిఎన్నో విశిష్టతలున్నాయి. చైత్ర వైశాఖాలు మనకు వసంత ఋతువు.

ఈ మాసాలలోనే మల్లెపూలు కోకొల్లలుగా మనకు లభిస్తాయి. మామిడిపండ్లు రుచులూరిస్తాయి. ప్రకృతి వాతావరణం ఇంపుగా సొంపుగా హృదయాలకు అలరింపుగా ఉంటుంది. "పూచిన పువ్వులెల్ల నుతి బొందె మనోభవు సంపకోలలై, వీచిన గాడ్పులెల్ల మలయానితమారుతంబులై" అన్నాడు సంకుసాల నృసింహ కవి తన కవికర్ణ రసాయనంలో. వర్షము, చలి, ఎండ, శైశిరము (ఆకురాలు కాలం) ఏవీ ప్రకృతిని, మానవ ప్రకృతిని ఇబ్బంది పాలుచేయవు. సమశీతోష్ణంగా రాత్రింబవళ్ళు అలరారుతాయి.

ఉగాది ఇట్లా పలకరించగానే తొమ్మిది రోజులలో పరమపురుషుడు, పరాత్పరుడు, పరంధాముడు, మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు దుష్ట శిక్షరక్షణకు అవతరించాడు.

రామాయణంలో వసంత ఋతువర్ణన ఎంతో హృదయంగమంగా ఉంటుంది. 'ఇనకులమునందు ఇంపుగా పుట్టి' అని త్యాగరాజు స్వామి తన ఇష్ట దైవాన్ని వర్ణించాడు. కాల గమనంలో సౌరమాన పరిగణన ప్రాధాన్యంగా ఉగాది పండుగ వస్తుంది. భారతదేశంలో చాలా ప్రాంతాలు సౌరమానాన్నే పాటిస్తున్నాయి. ఉగాది పండుగను తెలుగువారు కన్నడులు, గుజరాతీలు, బెంగాలీలు, మహారాష్ట్రులు ఒకే రోజు జరుపుకుంటారు. అదీ ఈ పండుగకు భారతదేశం లోని విశిష్టత.

"మధుజిహ్వా, మధుమతి, మధుమా సోదయా, మధు: మాధవచ, మహాభాగా .. ' అని శ్రీలక్ష్మీ సహస్రం.

చైత్రమాసాన్నే మధుమాసం అనికూడా అంటారు. చైత్రమాసాన్ని వర్ణిస్తూ ఆదికవి నన్నయ్య "కమ్మని లతాంత మేలకున్ మొనసి ఝుమ్మని మధుపమ్ములు..... అని తెలుగు తీయదనాన్ని, సంస్కృత సౌగంధ్యాన్ని సమాసకరించే'లయగ్రాహి' వృత్తాన్ని సువర్ణ బాషకంలో పానకం లాగా అందించాడు.

ఇక వైశాఖమాసంలో నృసింహ జయంతి వస్తుంది.

ముఖ్యంగా తెలుగు వారికి నృసింహ జయంతి గొప్ప పండుగ. భారతదేశంలోనే తెలుగు నాట నృసింహ క్షేత్రాలు ఎక్కువ. తెలంగాణాలోను, తీరాంధ్రలోనూ ఉన్న నృసింహ క్షేత్రాలు, ఆరాధన సంప్రదాయం భారతదేశంలో మరి ఎక్కడా లేదు. ఒకప్పుడు భారతదేశంలో కాశ్మీరు ప్రాంతంలో కూడా నృసింహారాధన ఉండేదనిపిస్తుంది. ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు నృసింహారాధకులే అని పండితులంటారు. ఈ విధంగా ఉగాది పండుగ

వెన్నంటి శ్రీరామ నవమి, నృసింహ జయంతి లాంటి పర్వదానాలు ఈ వసంత ఋతువులో తెలుగు వారిని ఉల్లాస పరుస్తాయి.

బమ్మెర పోతన, భక్త రామదాసు, త్యాగరాజ స్వామి వంటి మహాత్ములు గొప్ప రామభక్తులుగా, తెలుగు వారి సంస్కారాన్ని, ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని తరతరాలుగా సుశోభితం చేశారు. ఈనాటికీ భక్తి, రక్తి, ముక్తికి మార్గదర్శనం చేస్తున్నారు. ఇది వసంత ఋతువు ప్రాధాన్యం, ప్రాకామ్యం తెలుగు వారికి.

# ఉగాది

– షంషాద్

గడచిన ఉగాదుల
స్వాగతాల తోరణాలన్ని
జ్ఞాపకాల దండలో గుచ్చబడ్డాయి
లాభాలో నష్టాలో
అంతో ఇంతో
ప్రతిసారిలాగే కోయిల కూస్తూ
మామిడి కాస్తూ
వేప పూస్తూ సంవత్సర కాలంలో
షడ్రుచుల పట్టికలో
దేని వాటా ఎంతైనా
జీవితకాలం తినాల్సిందేగా
అయినా ఆశల గుమ్మానికి
కొత్త తోరణాలతో
మళ్ళీ మళ్ళీ ఉగాదిని
స్వాగతిస్తూనే ఉన్నా

# (నవ) నీతి పద్యాలు

- పుల్లెల శ్యామసుందర్

కం.

డబ్బులు వచ్చును బోవును
ఇబ్బందులు వచ్చిపోవు నిలలో మరి దా
నబ్బది పొట్టది మాత్రము
ఉబ్బుతుఁ దానొచ్చు గాని ఊడదు శ్యామా

కం.

తాగినవానికి స్తంబము
ఊగక యుండంగదన్ను నొసగెడి రీతిన్
బాగగు స్టాటెస్టిక్కులు
వీగెడి థియరీకి దన్ను పృధ్విన శ్యామా!

(Statistics are like a pole to a drunk, something to lean on)

కం.

స్టాటిస్టిక్కులు నమ్మకు
పోటీ బికినీకి అవియె పోలికఁ జూడన్
ఓటగు సరుకుల నైనను
బ్యూటీగా చూపగలవు పుడమిన శ్యామా!

(Statistics can make things appear more beautiful than they are)

కం.

రాగములందున భైరవి,
భోగములందున సురతము - బూరెలు వడలున్
వేగిన భక్ష్యములందున,
గూగులు గాలింపునందు, గొప్పవి శ్యామా!

కం.

దినమున కొక్క ఆపిలుఁ దిన
అనువుగ విధి దరికిచేర డటులనె రోజూ
పనిగొని వెల్లుల్లిని దిన
జనులెవ్వరు దరికిరారు, జగతిన శ్యామా!

(An apple a day keeps the doctor away,
a garlic a day keeps everyone away!!)

కం.

గ్రాఫిక్కు లేని సాఫ్ట్వేర్,
ప్రూఫులు లేనట్టి సైన్సు, లోకమునందున్,
ట్రోఫీలు లేని క్రీడయు,
రీఫిల్లులు లేని డ్రింకులెందుకు శ్యామా!

కం.

టాఫీలు లేని బాల్యము,
లీఫులు లేనట్టి చెట్లు, బ్రీఫగు విందున్,
సోఫాలు లేని యిల్లు, జి
రాఫీ లేనట్టి 'జూ'లు, రద్దుర శ్యామా!

కం.

వినదగుఁ నెవ్వరు జెప్పిన
వినినంతనె గూగులందు వెదకఁగ వలయున్
పనిగట్టి సెర్చిఁ జేసెడి
మనుజుడెపోలోకజ్ఞాని మహిలో శ్యామా!

కం.

తగునని వలచిన చిన్నది
సొగసుగ తన దరికిఁ జేర శోభనమందున్
అగరపు వత్తుల కమ్మని
పొగత్రాగని వాడు దున్న పోతుర శ్యామా!

# చెట్టు

– తాటిపాముల మృత్యుంజయుదు

*('సిలికాన్ వ్యాలీ' శబ్దానికి దగ్గరగా 'సిరికోనా' తెలుగు పదం మకుటంతో 'చెట్టు' వృత్తంపై కొన్ని కందాలు)*

బేలా! పూగోల వలదు
ఏలా? కోపము తగునా ఇట ప్రియసఖికిన్
బాలా! తెచ్చితిపోచెట్టు
చాలా? ఇక పారిజాత ఝరి సిరికోనా!

రణమున దశరథ తనయులు
గణములు కూలగ మాయల ఘాతుకములతోన్
చెణుగున హనుమంతుడెగిరె
క్షణముల సంజీవని తెచ్చె ఘన సిరికోనా!

చందన అశోక మామిడి
మందార పనస సుగంధ మానులు ఎదిగే
అందముగ మతంగ విరియ
మోదమున శబరి కనె రాముని సిరికోనా!

వెచ్చని రవి ఛవి, ఆకుల
పచ్చదనము బొగ్గు పులుసు వాయువు, వేరున్
జొచ్చి యెగబ్రాకు జలములు
అచ్చెరువున ఆన్నమయ్యె హర సిరికోనా!

మరమని తమిళము కన్నడ
ధరణీరుహ భూరుహమనిన క్షితిజ నీవే
తరువని అందురు కొందరు
మరికొందరు నగ కుజ ద్రుమ మన సిరికోనా!

జామ అనాస కమల దా
నిమ్మ ఉసిరి మాది వెలగ నేరేడులివే
నిమ్మ అరటి ఖర్జూరలు
మామిడి బొప్పాయి పనసల ఫల సిరికోనా!

పదివేల రూపములుగా
ముదమున ఆకులు గింజలు పూలున్ ఫలములే
పదెపదె అనుగ్రహమివ్వగ
పదిలంగా చూడు మమ్ము భలె సిరికోనా!

# ఆరు రుచుల తెలుగు గడ్డ

– సిరాశ్రీ

పలుకుయొకటి గాని పలు కుల్కులను చిల్కు
'తీపి' యాసల మేటి తెలుగు గడ్డ

శత్రు పక్షమునకున్ స్వాతంత్ర సమరాన
'చేదు' రుచిని చూపి చెలగె గడ్డ

చిలిపి పద్యాలనే చిలుకుచు వేలేండ్లు
'పులుపు' పంచి ముదము పొంగు గడ్డ

పౌరుషమ్మును పెంచి పంచంగ తీరుగా
'ఒగరు' నిండిన గొప్ప పొగరు గడ్డ

మనసు విరిసి మురిసి మమ'కారముప్పొంగ'
ఆరు రుచుల తెలుగు అమృతమ్ము

తెలుగు వంటలెల్ల దేదీపయమానమౌ
ఖ్యాతిగాంచె దాటి ఖండములను

# ఉగాది ఉద్గతము

- టేకుమళ్ళ వెంకటప్పయ్య
విజయవాడ

ఉ. కోకిలకూత వీనులకు గొంచెము సోకదు నేడు యెచ్చటన్
కాకులు పిచ్చుకమ్మలను గానము నేడిల దుర్భిణీలకున్
చీకిన గొప్పపద్ధతులు చేటును గూర్చును లోకహానియౌ
పాకిన పాడుసంస్కృతుల పారగ ద్రోలెడి రోజులెన్నడో!

13
ఉ. ఎన్ని యుగాదులొచ్చినవి? యేమియు మార్పులు గానరెవ్వరున్
కన్నులు గాయలై జనులు క్రాంతిని గోరగ యెండమావియే!
యెన్నియొ బాధలన్ పడలయేడ్పులె వారికి జీవితమ్ములన్
వున్నవి మంచిరోజులని యూరక నూరడి పుచ్చునేతలే!

ఉ. మారును ఐదుయేళ్ళకొక మాయల మాటల నాయకోత్తముల్
చేరిరి రాజకీయముల చేతుల నిండుగ నార్జనార్థమై
వారిని వీరు దిట్టుటలు, వ్యాజ్యము లేపుటె లోకరీతిగా
మారరు పాలకుల్ నిజము! మారవు దారుణ రీతులెన్నడున్

తే.గీ. చెట్టుపుట్టల గూల్చగ చేరి జనులు
ఖండ వాతావరణమిట్లు గాలిపోవు
జంతు జాలమ్ము నశియించు జాగులేక
తినుట కేమియు దొరకక తిప్పలొచ్చు

ఆ.వె. మంచి నేతలున్న మారును బ్రతుకులు
మంచి నేత యున్న మార్పులొచ్చు
మంచి యన్న మాట మనకెల్ల చేదాయె!
మార్పు యెట్లు వచ్చు మారుతీరు?

ఆ.వె. గాంధి పేరుజెప్ప గర్వంబు గలిగేటి
నేల మీద మనము నిల్చినాము
పూని మంచి జేయు పుణ్యాత్ములేలేక
భరత మాత దిగులు పడెను నేడు

# పండగ ఆఫర్

– ఫణి మాధవ్ కస్తూరి

తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది, హుషారుగా పాట వినిపిస్తోంది బాత్రూం లోంచి..

ఏంటండీ చాలా హుషారుగా ఉన్నారు.. ఈ పూట......వంటింట్లోంచి భార్యామణి కేక.. (పాట భరించలేక ఆర్తనాదం అనుకోవచ్చేమో!)

ఇవాళ ఉగాది కదోయ్! ఇవ్వాళ సంతోషంగా ఉంటే, సంవత్సరమంతా సంతోషంగా ఉండొచ్చు అందుకని...... నా సమాధానం..

ఇంకా నయం ఇవ్వాళ తింటే సంవత్సర మంతా తిన్నట్టే, అని, ఇంక మాకు కూడు అదీ పెట్టరా ఏంటి భార్యా మణి రుస రుస....

అది కాదోయ్, అది.....చిన్న చిన్న వాటికే....... రోజూ చేసే పనులకి కాదు, కనీసం ఈ రోజైన ఆనందంగా ఉంటామని.... పెద్దవాళ్ళు పెట్టిన ఒక విధమైన 'ఇది'..... ఏం పేరు పెట్టాలో తెలియక తికమక..

అంతేలేండి ఈ పండక్కి ఒక చీర నా మొహం మీద పడేసి, ఇక సంవత్సరమంతా పండగ చేసుకో అనచ్చునేగా మీ ఆలోచన..మళ్ళీ భార్యామణి లా పాయింటు..

అబ్బ అదికాదే. అర్థం లేకుండా మాట్లాడకు. ప్రతీది రాద్ధాంతం చేస్తావ్.... పొద్దున్నే తలకాయ నొప్పి..కాస్త కాఫీ నీళ్ళు నా మొహాన కొట్టు, అలా వెళ్ళి వేప పూత, అదీ... తెస్తా.. నా నిరసన అంతే లేండి! పెళ్ళైందగ్గర నుంచీ నేనేమన్నా అడిగానా? నన్ను చూస్తేనే మీకు తలనొప్పి... అందుకే అన్నా, మా నాన్నతో, అబ్బాయి గురించి అన్ని తెలుసు కోండి నాన్నా! అని, ఎప్పుడు చూసినా తలనొప్పి అంటారు ఏం మాయదారి జబ్బో ఏమిటో..?

నాకే జబ్బులు.... మాయరోగాలు లేవు, ముందు కాఫీ నీళ్ళు ఇచ్చేదేమన్నా ఉందా? లేకపోతే అది కూడా బయటే తగలడమంటావా...? అంటే! నేనిచ్చే కాఫీ నీళ్లన్నమాట? బయట అమృతం దొరుకుతుందా... అట్లాంటప్పుడు నన్ను అడగడం ఎందుకు.?

అబ్బా! కాలికేస్తే వేలికెయ్యకే... ఏదో మాటవరసకి అన్నా..

అంతేలెండి ఎంతసేపూ నన్ను ఏదో ఒకటి ఆడిపోసుకోవడమే కానీ పెళ్ళాన్ని పండక్కి బయటకి తీసుకెళ్ళి ఏదైనా కొనిపెడదాం..హొటల్లో భోజనం చేద్దాం అని ఉండదు కదా..నా బతుకంతా ఇంతే.... ఉగాదైతే ఏంటి ... దీపావళి ఐతే ఏంటి..మళ్ళీ కుళాయి.. ఆపవే..ఆపు..ఆ కుళాయి ఆపు ....నిన్ను గానీ ఆపకపోతే హైదరాబాదులో సునామి అదీ వచ్చేస్తుంది.. జనం నమ్మరు కూడాను .... ఇంతకీ బయటకెళ్దాం అంటావ్ అంతే కదా.. ఊ..ఇంద కాఫీ... గోముగా భార్యామణి.. మరీ అంత వంకర తిప్పకు మూతి చూళ్ళేను.... పోదురూ బడాయి ..సర్రున గుండెల మీద బొచ్చు పీకింది.... నోరు కాలడం వల్లా.. బొచ్చు పీకడం వల్లా ఒక్క సారిగా గుండెల మీద మంట.... అర్ధాంగి కొంటె చూపు వల్ల గుండెలోపల మంట... మొత్తానికి కారం తిన్న ఫీలింగు....

ఒసేయ్ నీ మెలికలాపు..అలా మెలికలు తిరిగి తిరిగి అలానే ఉండిపోతావేమో.... కొంచెం బయటకు వెళ్ళి .... ఆ వేప్పూత తెస్తా.. కొంచెం

ఉగాది ప్రసాదం తిని అలా బయటకెళ్దాం లంచ్‌కి... సరేనా....హుయ్ ఏదో సౌండు పక్కనుండాల్సిన నా భార్యామణి బీరువా మీద..... అదేంటే అక్కడున్నావ్.. కావాలంటే బీరువాలో చీరకట్టుకుని రెడీ అవు.... అంతేకానీ అలా బీరువా మీద కూర్చోకూడదు..

అది కాదండీ మన పెళ్లైన తరువాత మొట్టమొదటి సారి మీరు నన్ను బయటకు తీసుకెళ్తున్నారన్న ఆనందంలో గాల్లో తేలినట్టై ఇక్కడొచ్చి పడ్డా.... కొంచెం నన్ను దింపండి గోముగా అడిగింది కొంచెం సిగ్గుపడుతూ.... సరేలే నిన్ను దింపితే.. ఇంక నా నడుము ఉన్నట్టే..మరీ సిగ్గు పడకు..నీకు సూటవదు ..కానీ

ఇవ్వాళ పండగ కదా..ఇవ్వాల్టికి ఇంట్లోనే తినేసి వచ్చే ఆదివారం బయటకెళ్దాం సరేనా..... సుయ్ ఈ సారి సౌండు మారింది.. చూస్తే నా పక్కనే మా ఆవిడ... నేను ముందే అనుకున్నాను అడగ్గానే మీరు ఒప్పుకున్నప్పుడే అనుకున్నాను.. ఏదో ఒకటి చెప్పి బయటకెళ్ళే ప్రోగ్రాం మార్చేస్తా రని...మళ్ళీ కుళాయి తిప్పింది..

అబ్బ ఆపవే.. నీ నస, సందు దొరికితే చాలు కుళాయి తిప్పేస్తావు.. దిక్కుమాలిన టీ వీ సీరియల్స్ చూడకే అంటే వినవు.. నీ గోల నీదే కాని నన్ను పట్టించుకోవే... ఊరికే, నిన్ను బీరువా మీద నుంచి దింపడానికి అల్ల అన్నానంతే..ఎలా ఉన్నాయి మన తెలివితేటలు..

భలె భలే... అంటూ గెంతు లేస్తుండగా... ఠంగ్ ఠంగ్ మని సౌండు ఏంటా అని చూస్తే ఆ గెంతులకి భార్యామణి పైకెగిరి రూఫ్కి తల తగుల్తోంది.. నీ సంబరం బంగారం కానూ ఆగవే.... ఉగాది పచ్చడికి అన్ని రెడీ చేసుకో... అంటూ బయటకి కదిలా.....

లంచ్ పూర్తి అవుతుండగా... భార్యామణి విశ్వ రూపం చూపించడం మొదలైంది.. ఏవండీ బల్ల కిందనుంచి నా కాలుని తొక్కింది..(ప్రేమగా) నోట్లో ఉన్న ఐస్క్రీం కాస్తా బయటకొచ్చి చొక్కా మీదా.. కొంచెం బల్లమీదా.... కారిపోయి పాంటు మీదా పడ్డది.. ఏమైందే.... అల్ల టొక్కావు.. (ఇచెగ్రేంఎఫ్ఫెచ్త్) అన్నా గాభరాగా తుడుచు కుంటూ... అది కాదండీ ఎలాగూ ఇక్కడి దాకా వచ్చాం కదా.... పక్కనే బొందనా బ్రదర్స్ వాళ్ళు పండగ డిస్కౌంటు ఇస్తున్నారట.... ఒక్క సారి చూసొద్దామండీ... .ఎలాగూ ఎండగా ఉంది కదా.. కాస్సేపు ఏ సీ లో తిరిగినట్టూ ఉంటుంది.... ఈ ఐడియా ఏదో బాగానే ఉంది అనిపించింది.. ఏ ఐమాక్సుకో, వెళ్ళి అర్ధంపర్ధం లేని సినిమాకో, అర్ధం కాని సినిమాకో, మూడొందలు తగలెయ్యడం కన్నా ఇదే నయమని పించింది.. అంతే కాదు ఐమాక్సు కెళితే క్లైమాక్స్‌లోపల, చిప్ప పాతిక రూపాయల చొప్పున, మొక్కజొన్న గింజల్ని నా బుర్రని నంచుకుని తినే బాధ కూడా తప్పుతుంది కదా అని సరే అన్నా.. (అదెంత తప్పో తరువాత తెలిసింది).

లోపలకెళుతూనే.. ఏసీ గాలి పలక రించింది.. కాకపోతే ఎంటో ఊదరగొట్టే సౌండుతో పాటలు వినిపిస్తున్నాయి.. పక్క వాళ్లు మాట్లాడేది కూడా వినిపించట్లేదు..

ఈలోగ, ఒకతను బహుశా మేనేజర్ అనుకుంటా నవ్వుతూ వచ్చి సారీసా అమ్మా.. అన్నాడు కాకపోతే ఇక్కడికెందు కొస్తామని అందామనుకున్నా .. కానీ రెండు గంటలు ఏసీ లో ఉండాలి కదా వాడితో గొడవెందుకులే అని పూరుకున్నా..

..ఎంతలో కావాలమ్మా వెంటనే అతని ప్రశ్న.. అది నీకెందుకు నచ్చితే ఎంతైనా కొంటాం మా ఆవిడ కొంచెం గట్టిగానే అంది..నాకూ గర్వంగా అనిపించింది. కాని ఎక్కడో ఒక్కసారి భయం కూడా వేసింది..

అది కాదమ్మా.... పెళ్ళి బట్టలు, డిజైనర్ సారీస్ లాంటివైతే కొంచెం కాస్ట్లీవి పైన ఉన్నాయి.... ఫాన్సీ చీరలు అటు వైపున్నాయి మీరు వెతుక్కోకుండా ఉండాలని..... నసిగాడు (ఇలా అనే కన్నా లౌక్యంగా రేట్ల లిస్టు చెప్పాడు అనొచ్చేమో).

మా పెళ్ళి ఎప్పుడో అయిపోయిందిలే.. ఏదో ఆఫరన్నారుకదా..... అవి చూద్దామని ఈ సారి మా ఆవిడా నసిగింది,,,

అవా! అక్కడున్నయి, రేయ్! ఆఫర్ చీరలంట చూపించండ్రా... అని నా చెవి దగ్గరే గట్టిగా అరిచి అదో రకంగా చూసుకుంటూ.. రండి రండి చీరలా అమ్మా అంటూ అదే ప్లాస్టిక్ నవ్వు అతికించుకుని అప్పుడే లోపలికొస్తున్న వాళ్ళ కెదురెళ్ళడు..

అతను చూపించిన వైపుకెళ్ళే సరికి ..దుశ్శాసనుడు లాగిన చీరల్లా ఒక ఎత్తైన చీరల కొండ కదులుతూ కనిపించింది.. చీరలు కదులుతున్నా యేంటా అని దగ్గరకెళ్ళి చూస్తే ఆ చీరల్లో ఆల్రెడీ కొంతమంది ఆడవాళ్ళు లోపల తమకు నచ్చిన కలర్లు.. డిజైన్లు వెతికే పనిలో ఉన్నారు.. మా ఆవిడా వన్ టూ త్రీ అంటూ ఆ కుప్ప మీద దాడి చేసింది..

కాసేపు పెనుగులాట తర్వాత... రెండు, చీరల్తో బయటకొచ్చింది మా ఆవిడ.... ఒక్కోచీర గురించి చెబుతూ ఇది ఫలానా సినిమాలో ఫలానా హీరోయిన్ వాడిన (సారీ కట్టిన అనాలేమో). అసలు సినిమాల్లో హీరోయిన్లు చీరలు ఎక్కడ కట్టుకున్నారే అని అమాయకంగా అడిగా.. మీరెప్పుడూ అంతే చిలిపి... తొక్కూడేలా చెంపమీద గిచ్చి.. ఫామిలీ ఫొటోలో కట్టుకుందిలెండి... ఫొటోలో కట్టింది కూడా చూసి గుర్తుంచుకున్న ఆవిడ సునిశిత, సూక్ష్మదృష్టికి ఆశ్చర్యపోయి... సరే నీకు మరీ నచ్చితే తీసుకో అన్నా.. మళ్ళీ ఎగిరి గంతెయ్యా బోయి షాపు కదా అని తమాయించుకుంది..

మీరు... మళ్ళీ ఏదైనా చేస్తున్నేమో అని నేనే ఒక్క గెంతు పక్కకి గెంతా.... మా సర్కస్ ఫీటు చూసి ఇందాకటి మేనేజర్ లాంటి ఆయన మళ్ళీ వచ్చి నుంచున్నాడు.. ఇంతలో మా ఆవిడ ఆ చీర చూసి ఏమండీ దీనికి కన్నం ఉంది ఏంటండీ..... నన్నో, ఆ అమేనేజర్నో, అర్ధం కాలే .. కానీ ఇలాంటి వన్నీ అలవాటైన ఆ మేనేజరు.. ఇవన్నీ కొంచెం పాడైన చీరలమ్మా అందుకనే ఆఫర్లో ఇస్తున్నాం.. సేం ఇలాంటి చీరే మంచివి, కొత్త స్టాకు పైన ఉన్నాయి రండి అంటూ తీసుకెళ్ళాడు.. ఐదు నిమిషాల్లో ..ఐదు వేలు బిల్లుతో తిరిగొచ్చిన మా ఆవిడ ఆనందం చూసి..... ఐదొందలు అనుకున్న బడ్జెట్ ఐదు వేలు ఐనా, కుళాయి గుర్తొచ్చి వెంటనే క్రెడిట్ కార్డు తీసిచ్చా.. దాన్ని అపురూపంగా అందుకుంటూ... మీకు పేంట్ షర్ట్స్ ఏమీ వద్దా సార్ మంచి ఆఫర్ ఉంది... అని కొంటెగా నవ్వాడు... ఆ మేనేజర్... పబ్లిసిటీ కోసం వాళ్ళు పెట్టిన ఆఫర్ దెబ్బకి... అప్పటికే దిమ్మ తిరిగిన నేను లేవడానికి మరో నెల పట్టొచ్చు.. మళ్ళీ వచ్చే నెల కలుద్దాం.. అందరికీ ఉగాది శుభాకాంక్షలు...

పండగ ఆఫర్ల పట్ల పారా హుషార్.

# సిలికానాంధ్ర మనబడి

( WASC గుర్తింపు పొందిన ఏకైక తెలుగు విద్యాలయం)

10+ దేశాలు
30+ రాష్ట్రాలు
250+ ప్రాంతాలు

తెలుగు
చదవడం
వ్రాయడం
మాట్లాడడం
నేర్చుకోండి

12 సం||లు

45000+
విద్యార్థులు

1200+
భాషాసేవకులు

**గుర్తింపు**
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు
- అమెరికాలోని వివిధ స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాషగా (World Language Credit) గుర్తింపు
- ప్రఖ్యాత WASC సంస్థచే గుర్తింపు

**పరీక్షలు**
- ప్రకాశం, ప్రభాసం విద్యార్థులకు విశ్వవిద్యాలయం పరీక్షలు
- సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ

**కార్యక్రమాలు**
- పిల్లల పండుగ, తెలుగు మాట్లాట, బాలానందం, మనపద్యం, తెలుగుకుపరుగు, పలుకుబడి, పద్యనాటకం, నాటకోత్సవం....





తరగతులు ప్రారంభం
సెప్టెంబర్ 7 , 2019

**తరగతులు**

| | | |
|---|---|---|
| బాలబడి | ప్రవేశం | ప్రసూనం |
| ప్రకాశం | ప్రమోదం | ప్రభాసం |

4-6 సం|| - బాలబడి
6+ సం || - ప్రవేశం

Visit : manabadi.siliconandhra.org    Email : manabadi@siliconandhra.org

Contact: 1-844-626-BADI (2234)

Follow us on : /SiliconAndhraManaBadi